RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 సంచిక 29 ఎడిటర్: జేరిపోతుల సంపత్, కరీంనగర్ మంగళవారం 05-05-2026 పేజీలు: 8, వెల : 2.00

తెలంగాణ వాణి TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127 The Voice of Telangana

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292

## విజన్ – 2047

## ప్రభుత్వం ముందు పలు సవాళ్లు..!

TELANGANA RISING

తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగాలనుకుంటున్న ఈ దశలో 'విజన్ 2047' ఒక సాధారణ ప్రభుత్వ ప్రణాళిక కాదు..ఇది భవిష్యత్తు తెలంగాణకు రూపకల్పన. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్ల నాటికి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టే లక్ష్యంతో రూపొందిన ఈ విజన్‌లో వ్యవసాయ రంగానికి, ముఖ్యంగా విత్తన రంగానికి కీలక స్థానం ఉంది. ఇప్పటికే సీడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా పేరు తెచ్చుకున్న తెలంగాణను గ్లోబల్ సీడ్ క్యాపిటల్ గా తీర్చిదిద్దాలనే సంకల్పం గొప్పదైనప్పటికీ, ఆ లక్ష్యానికి వెళ్లే మార్గం అంత సులభం కాదు. అవకాశాలు ఎంత ఉన్నాయో, అంతే స్థాయిలో సవాళ్లు కూడా ముందున్నాయి.

2వ పేజీలో...

- ఉదయ్..
BCJ, MCJ, LLB, MPhil., PhD
సీనియర్ జర్నలిస్టు
ఫోన్ నెంబర్ 8367603197

- ప్రతి విత్తనాన్ని ట్రాక్ చేసే డిజిటల్ వ్యవస్థ రావాలి..!
- నకిలీ విత్తనాల కేసుల్లో విచారణ వేగవంతంగా జరగాలి..!
- రైతుల అవగాహన పెరగాలి..!
- పరిశోధన సంస్థలు, పరిశ్రమలు, రైతుల మధ్య సమన్వయం పెరగాలి..!
- వాతావరణ మార్పులకు తట్టుకునే విత్తనాభివృద్ధి అవసరం..!
- నాణ్యత, పారదర్శకత, నమ్మకం కీలకం..!
- రైతు చేతిలో నాణ్యమైన విత్తనం ఉంటేనే పంట బాగుంటుంది..!
- పంట బాగుంటేనే రైతు బాగుంటాడు..!
- రైతు బాగుంటేనే రాష్ట్ర భవిష్యత్తు బలపడుతుంది..!
- విజన్ 2047 కేవలం లక్ష్యం కాదు.. రాష్ట్ర భవిష్యత్తుపై సామూహిక బాధ్యత..!



బీజేపీ ఆఫీసులో విక్టరీ సెలబ్రేషన్స్..

## నయా లుక్‌లో ప్రధాని మోడీ

ఢిల్లీ, (తెలంగాణ వాణి) : దేశవ్యాప్త ఉత్కంఠకు తెరదించుతూ వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ (దీజీూ) జైత్రయాత్ర కొనసాగించింది. పశ్చిమ బెంగాల్, అస్సాం మరియు పుదుచ్చేరిలో పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయం విజయోత్సవ సంబరాలతో హోరెత్తిపోయింది. ఈ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన వేషధారణతో అందరినీ ఆశ్చర్యపరిచారు. ఎప్పుడూ కుర్తా-పైజామా లేదా జాకెట్‌తో కనిపించే ప్రధాని మోడీ, ఈసారి విజయోత్సవ వేడుకలకు సరికొత్త వేషధారణలో హాజరయ్యారు. బెంగాల్, దక్షిణాది సంస్కృతిని ప్రతిబింబించేలా ఆయన తొలిసారిగా పంచెకట్టులో ప్రత్యక్షమయ్యారు. ప్రధాని నయా లుక్ చూసి పార్టీ కార్యకర్తలు, అభిమానులు కేరింతలు కొట్టారు.

దిగ్గజ నేతల సమక్షంలో సంబరాలు..: ఈ కార్యక్రమంలో ప్రధానితో పాటు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జేపీ నడ్డా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తదితర అగ్రనేతలు పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం వద్ద కార్యకర్తలు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకుంటూ 'భారత్ మాతా కీ జై' నినాదాలతో హోరెత్తించారు.

విజయోత్సవ సభలో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు.. "పశ్చిమ బెంగాల్ గడ్డపై కమలం వికసించింది. అస్సాం, పుదుచ్చేరి ప్రజలు కూడా అభివృద్ధికి పట్టం కట్టారు" అని పేర్కొన్నారు. ప్రజలు బీజేపీపై ఉంచిన నమ్మకమే ఈ విజయానికి పునాది అని, ఇది పార్టీ విజయం మాత్రమే కాదు.. ప్రజల విజయమని అభివర్ణించారు. ప్రాణాలకు తెగించి, అహోరాత్రులు శ్రమించిన ప్రతి కార్యకర్తకు ప్రధాని ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. బెంగాల్‌లో టీఎంసీ కోటను బద్దలు కొట్టి, బీజేపీ మొదటిసారిగా అధికారాన్ని చేపట్టబోతుండటం దేశ రాజకీయాల్లోనే మైలురాయిగా నిలిచింది. అస్సాంలో అధికారాన్ని నిలబెట్టుకోవడంతో పాటు, పుదుచ్చేరిలోనూ కమలం జెండా ఎగరడం బీజేపీ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహాన్ని నింపింది.



## దేశమంతా డబుల్ ఇంజన్ సర్కార్ ఖాయం

స్థానిక వ్యతిరేకతతోనే కేరళలో కాంగ్రెస్ విజయం
కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్య

కరీంనగర్, మే4 (తెలంగాణ వాణి) : దేశమంతా ఇక డబుల్ ఇంజన్ సర్కార్ రావడం ఖాయమని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. పశ్చిమబెంగాల్‌లో ఎన్నో అరాచకాలు జరిగాయని.. బంగ్లా చొరబాటు దారులకు దారులు మూసుకుపోయాయని సంజయ్ కుమార్ పేర్కొన్నారు. దేశం అంతా బీజేపీని కోరుకుంటోందని ఉద్ఘాటించారు.

2వ పేజీలో...

## తమిళనాట కొత్త చరిత్ర ఆవిష్కృతం

ద్రవిడ పార్టీల పాలనకు చరమగీతం
అనూహ్యంగా దూసుకు వచ్చిన విజయ్ పార్టీ
మ్యాజిక్ ఫిగర్‌కు చేరువగా టివికె
ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తలకిందు చేసిన ఫలితాలు
తమిళనాడు సిఎం స్టాలిన్ ఘోర పరాజయం
ఆయన బాటలోనే అత్యధిక మంత్రులు ఓటమి
పెద్దగా ప్రభావం చూపని బిజెపి నేతలు

చెన్నై, (తెలంగాణ వాణి) : తమిళనాట కొత్త చరిత్ర ఆవిష్కృతమయ్యింది. అనూహ్యంగా దూసుకు వచ్చిన నటుడు విజయ్ పార్టీ తమిళనాట జెండా పాతింది. ఎగ్జిట్ పోల్ అంచనాలను తలకిందులు చేస్తూ ద్రవిడ పార్టీలను మట్టి కరిపించింది. అధికార డిఎంకెను ఓ కుమ్ము కుమ్మింది. తమిళనాట హిందీ వ్యతిరేకత, దక్షిణాదికి అన్యాయం అంటూ హుంకరించిన సిఎం స్టాలిన్ పార్టీ ఓడడమే గాకుండా స్వయంగా ఆయన కూడా ఓడిపోయారు.



2వ పేజీలో...

## జ్యువెలర్ షాప్ అటాక్.. క్షతగాత్రులకు కేటీఆర్ పరామర్శ



కరీంనగర్ : కరీంనగర్ జ్యోతినగర్‌లోని పీఎంజే జ్యువెల్లరీలో ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఐదుగురు దుండగుల ముఠా దోపిడీకి పాల్పడటం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. దుండగుల ముఠా దోపిడీ చేసే క్రమంలో ప్రతిఘటించిన సిబ్బందిపై కాల్పులకు తెగబడి.. భారీ మొత్తంలో నగలను దోచుకెళ్లింది. ఈ ఘటనలో గాయపడ్డ వారు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా పీఎంజే జ్యువెల్లరీలో దొంగల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పరామర్శింం చారు. దాడికి సంబంధించిన విషయాలు అడిగిన తెలుసుకున్న కేటీఆర్.. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. కేటీఆర్ వెంట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, గంగుల కమలాకర్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డితోపాటు పలువురు నేతలు హాజరయ్యారు.





- రైతులకు నష్టం లేకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలి : ఉత్తంకుమార్ రెడ్డి
- ప్రతి రైతుకు న్యాయం జరిగేలా కలెక్టర్లు కృషి చేయాలి : పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రులు

## అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి



భద్రాద్రి బ్యూరో (తెలంగాణ వాణి): రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియపై హైదరాబాద్ నుండి పలువురు మంత్రులు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పశుసంవర్ధక శాఖ,పాడి పరిశ్రమాభివృద్ధి, క్రీడలు మరియు యువజన సర్వీసుల శాఖల మంత్రి వాకాటి శ్రీహరి, ఐటీ, పరిశ్రమలు అండ్ వాణిజ్యంశాఖల మంత్రి శ్రీధర్ బాబు, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ, వృద్ధుల సంక్షేమ, మరియు ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖల మంత్రి అట్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాల ప్రభావంతో ధాన్యం తడిచే పరిస్థితులు ఏర్పడుతున్నందున రైతులు నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని సూచించారు. వాతావరణ సూచనలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, వర్ష సూచనలు ఉన్నప్పుడల్లా వెంటనే రైతులకు సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామ స్థాయి వరకు వ్యవసాయ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండి రైతులను ముందుగానే హెచ్చరించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన అన్ని సదుపాయాలు సిద్ధంగా ఉండాలని, ముఖ్యంగా టార్పాలిన్లు, గిడ్డంగి సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. వర్షం వచ్చే సూచనలు ఉన్నప్పుడు ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు



## కవిత పార్టీలోకి.. వలసలు

హైదరాబాద్, : కొత్తగా కల్వకుంట్ల కవిత ప్రారంభించిన పార్టీలోకి వలసల పరంపర కొనసాగుతోంది. తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పేరుతో పార్టీ ప్రారంభించిన కవితకు.. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీగా కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పార్టీ ప్రారంభించడానికి ముందే బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు.. కవితకు మద్దతు తెలిపారు. ఈ క్రమంలోనే తాజాగా మరో మాజీ మంత్రి బోడ జనార్దన్.. కల్వకుంట్ల కవితతో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలోనే తన అనుచరులతో కలిసి అతి త్వరలోనే టీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు బోడ జనార్ధన్ స్పష్టం చేశారు.

2వ పేజీలో...

# విజన్ - 2047..

మొదటిపేజీ తరువాయి...

## ప్రభుత్వం ముందు పలు సవాళ్లు..!




రాష్ట్ర ఏర్పాటు తర్వాత అప్పటి టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) ప్రభుత్వం విత్తన రంగానికి బలమైన పునాది వేసింది. తెలంగాణ స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, నిల్వ, పంపిణీ వ్యవస్థను క్రమబద్ధీకరించింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనల ద్వారా కొత్త విత్తన రకాల అభివృద్ధి, వాతావరణ మార్పులకు తట్టుకునే హైబ్రిడ్ల రూపకల్పనలో కీలక పాత్ర పోషించింది. రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు రైతులకు ఆర్థిక భరోసా ఇచ్చి, నాణ్యమైన విత్తనాల వినియోగాన్ని ప్రోత్సహించాయి. సబ్సిడీ విత్తనాల పంపిణీ, సీడ్ హబ్‌ల ఏర్పాటు వంటి చర్యలు రైతులను ఉత్పత్తిదారులుగా మార్చి ఆదాయం పెంచాయి. ఈ సమగ్ర చర్యల ఫలితంగా తెలంగాణ దేశంలో విత్తన ఉత్పత్తిలో ముందుకు దూసుకెళ్తోంది.

నకిలీ విత్తనాల పెను సమస్య..!: అయితే ఈ విజయ గాథకు మరో వైపు కూడా ఉంది.. నకిలీ విత్తనాల పెను సమస్య. ప్రపంచానికి నాణ్యమైన విత్తనాలు సరఫరా చేస్తున్న రాష్ట్రంలోనే స్థానిక రైతులు నకిలీ విత్తనాల వల్ల నష్టపోవడం ఒక పెద్ద విషాదం. ప్రతి ఏడాది పంటలు విఫలమవడం, రైతులు అప్పుల పాలవడం, నమ్మకం కోల్పోవడం వంటి పరిణామాలు ఈ సమస్య తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. 2025 అక్టోబర్ వరకు వందల క్వింటాళ్ల నకిలీ విత్తనాలు సీజ్ చేయడం, 120కి పైగా కేసుల నమోదు, 150 మందికి పైగా అరెస్టులు చేయడం.. దీన్ని బట్టి సమస్య ఎంత లోతుగా ఉందో మనకు అర్థమవుతుంది.

నివారణా చర్యల దిశగా..: ప్రస్తుతం రాబోయే ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే ‘ప్రివెంటివ్ యాక్షన్’ దిశగా ప్రభుత్వం కదులుతోంది. క్షేత్రస్థాయిలో టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేసి సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచడం, విత్తన దుకాణాలు, గోదాములపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం, అనుమానాస్పద విత్తనాలను ల్యాబ్‌లకు పంపించి పరీక్షించడం వంటి చర్యలు చేపట్టేందుకు సిద్ధమైంది. ముఖ్యంగా పత్తి, మిరప, సోయాబీన్ విత్తనాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. లూజు విత్తనాల విక్రయాలపై కఠినంగా నిషేధం విధించడం కూడా ఒక కీలక చర్య.

ప్రత్యేక సీడ్ బిల్లుకు కసరత్తు..: దేశస్థాయిలో చట్టపరంగా కూడా కట్టుదిట్టమైన మార్పులు జరుగుతున్నాయి. కేంద్రం తీసుకొచ్చిన ‘సీడ్ బిల్-2025’ ద్వారా ప్రతివిత్తనానికి తప్పనిసరి నమోదు, QR కోడ్ ఆధారిత ట్రేసబిలిటీ, భారీ జరిమానాలు, జైలు శిక్షలు వంటి నిబంధనలు అమల్లోకివస్తున్నాయి. తెలంగాణప్రభుత్వం కూడా ప్రత్యేక సీడ్ చట్టాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. లైసెన్స్ ఉన్న కంపెనీలకే అనుమతి, ఫార్మర్-కంపెనీ ఒప్పందాలు తప్పనిసరి చేయడం, దళారుల వ్యవస్థను తగ్గించడం వంటి కీలక చర్యలు తీసుకుంటోంది. అయితే చట్టాలు ఎంత కఠినంగా ఉన్నా, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులు మాత్రం ఇంకా ఆందోళనకరంగానే ఉన్నాయి. మార్కెట్‌లో లూజు విత్తనాల విక్రయాలు కొనసాగుతున్నాయి. ఎమ్మార్పీ కంటే రెట్టింపు ధరలకు విత్తనాలు అమ్మడం, బిల్లుల్లో తక్కువ ధర చూపించడం, రైతులను షరతులతో బంధించడం వంటి అక్రమాలు జరుగుతున్నాయి. సరిహద్దు ప్రాంతాల నుంచి చౌక విత్తనాలు తెచ్చి విక్రయించడం, కొన్నిచోట్ల అధికారుల తనిఖీలు లేకపోవడం సమస్యను మరింత తీవ్రమయ్యేలా చేస్తున్నాయి. అంటే సమస్య కేవలం చట్టాల లోపం కాదు.. చట్టాన్ని కఠినంగా అమలు చేయలేక పోవడం ఉంది.

చర్యలు వేగవంతం..: ఇక ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని చర్యలు వేగవంతం చేసింది. ప్రత్యేక డ్రైవ్‌లు, కంట్రోల్ రూమ్‌లు, రైతుల ఫిర్యాదులకు తక్షణమే స్పందించడం, లైసెన్స్ రద్దు, క్రిమినల్ కేసులు వంటి చర్యలు కొనసాగుతున్నాయి. అవగాహన కార్యక్రమాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలను గుర్తించే మార్గాలను తెలియజేయడం జరుగుతోంది. అయినప్పటికీ, దళారుల ప్రభావం పూర్తిగా తగ్గకపోవడం ఒక పెద్ద సవాలు.

విజన్ - 2047 లక్ష్యం మాత్రమే కాదు..: ‘గ్లోబల్ సీడ్ క్యాపిటల్’ లక్ష్యం సాధించాలంటే తెలంగాణ ముందుగా తన అంతర్గత వ్యవస్థను బలోపేతం చేయాలి. నాణ్యత నియంత్రణలో రాజీ పడకూడదు. ప్రతి విత్తనాన్ని ట్రాక్ చేసే డిజిటల్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అమలు చేయాలి. నకిలీ విత్తనాల కేసుల్లో వేగవంతమైన న్యాయ ప్రక్రియ ఉండాలి. రైతుల అవగాహన పెరగాలి. పరిశోధన సంస్థలు, పరిశ్రమలు, రైతుల మధ్య సమన్వయం పెరగాలి. వాతావరణ మార్పులకు తట్టుకునే విత్తనాల అభివృద్ధి కూడా అత్యవసరం. ఏది ఏమైనప్పటికీ తెలంగాణ ‘సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా’గా ఎదగడం ఒక గొప్ప విజయమే. కానీ ‘గ్లోబల్ సీడ్ క్యాపిటల్’గా మారాలంటే నాణ్యత, పారదర్శకత, నమ్మకం అనే మూడు సూత్రాలను కచ్చితంగా పాటించాలి. రైతు చేతిలో నాణ్యమైన విత్తనం ఉంటేనే పంట బాగుంటుంది, పంట బాగుంటేనే రైతు బాగుంటాడు.. రైతు బాగుంటేనే రాష్ట్ర భవిష్యత్తు బలపడుతుంది. అందుకే విజన్ 2047 ఒక లక్ష్యం మాత్రమే కాదు..అది తెలంగాణ భవిష్యత్తుపై ఒక సామూహిక బాధ్యత. ప్రభుత్వం, రైతులు, పరిశోధన సంస్థలు అన్నీ కలిసి పనిచేసినప్పుడే ఈ లక్ష్యం సాకారం అవుతుంది.



ఉదయ్ కుమార్. జి
DAE, BA, BCJ, MCJ, LLB, MPhil., PhD
సీనియర్ జర్నలిస్టు
ఫోన్ నెంబర్ 8367603197

# తమిళనాట కొత్త చరిత్ర ఆవిష్కృతం

మొదటిపేజీ తరువాయి...

తెలంగాణ గవర్నర్‌గా పనిచేసిన తమిళసై సైతం వరుసగా రెండోసారి ఓటమిదిశలో ఉన్నారు. ఒకప్పటి తన అనుచరుడు, డిఎంకె పార్టీ నేత చేతిలో దారుణంగా ఓటమి చెందారు. ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ మాత్రం విజయం దిశగా ఉన్నారు. మంత్రులు చాలామంది ఇంటి ముఖం పట్టారు. ఇక టీవీకే చీఫ్ విజయ్.. పెరంబూరు నియోజకవర్గం నుంచి గెలుపొందారు. తాజా సమాచారం ప్రకారం టివికె 108 స్థానాల్లో, 59 స్థానాల్లో డిఎంకె, 44 స్థానాల్లో అన్నాడీఎంకే అభ్యర్థులు లీడింగ్‌లో ఉన్నారు. చెన్నై, చంగల్‌పట్టు, కంచీపురం, తిరువల్లూరులో టివికె విజయ కేతనం ఎగురవేసింది.వాస్తవానికి ఈ ప్రాంతాల్లో ద్రావిడ్ పార్టీల ఆధిపత్యం ఉండేది. సెంట్రల్ తమిళనాడులోనూ టీవీకే మంచి పోటీ ఇచ్చింది. తిరుచిరాపల్లి, తాంజావురు, కరూర్, పెరంబలూరు, అరియాలూరు, నాగపట్టణం, తిరువరూరు, పుడుకొట్టై, మలదుతరై జిల్లాలో టివికె గట్టి పోటీనిచ్చింది. దీంతో దళపతి ఇక కొత్త సిఎంగా కావడం అనివార్యం అయ్యింది. చిన్నా చితక పార్టీలు లేదా అన్నడిఎంకెతో పొత్తు కుదిరితే సరిపోతుంది. మొత్తంగా తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో దళపతి విజయ్ సరికొత్త చరిత్ర సృష్టించారు. తన రాజకీయ పార్టీ తమిళగ వెట్రి కళగం ద్వారా ఎన్నికల బరిలోకి దిగిన ఆయన, దశాబ్దాలుగా రాష్ట్రాన్ని ఏలుతున్న ద్రావిడ పార్టీలను విస్మయానికి గురిచేశారు. తాజా ట్రెండ్స్ ప్రకారం, విజయ్ నేతృత్వంలోని టీవీకే ఏకంగా 109 స్థానాల్లో ముందంజలో ఉండి, రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా అవతరించే దిశగా దూసుకుపోతోంది. సినిమా స్టార్‌లు రాజకీయాల్లో రాణించలేరన్న అపవాదును చెరిపివేస్తూ, విజయ్ తన సినీ పాపులారిటీని ఓట్లుగా మార్చుకోవడంలో సఫలమయ్యారు. తద్వారా దివంగత నేతలు ఎన్టీ రామారావు, ఎంజీ రామచంద్రన్, జయలలిత వంటి దిగ్గజాల సరసన ఆయన నిలిచారు. 1977 తర్వాత తమిళనాడులో డీఎంకే, ఏఐఏడీఎంకే కాకుండా మరో పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేయడం ఇదే తొలిసారి.పార్టీ అధికార ప్రతినిధి ఫెలిక్స్ గెరాల్డ్ మాట్లాడుతూ.. ’ఇది కుటుంబ రాజకీయాలకు, అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పు. ఎవరి మద్దతు లేకుండానే మేము సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం’ అని ధీమా వ్యక్తం చేశారు. విజయ్ నివాసం వద్ద ఆయన కుటుంబ సభ్యులు పార్టీ గుర్తు అయిన ’విజిల్’ సాంగ్‌తో సంబరాలు చేసుకున్నారు. మెజారిటీ మార్కు 118కి టీవీకే చేరువలో ఉంది. చిన్న పార్టీల మద్దతుతో లేదా స్వతంత్రంగా విజయ్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతో చెన్నైలోని టీవీకే ప్రధాన కార్యాలయం వద్ద కార్యకర్తలు మిఠాయిలు పంచుకుంటూ, జెండాలు ఊపుతూ పండుగ చేసుకున్నారు. ఇకపోతే ఎన్నికల్లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ఓడిపోయారు. కొళత్తూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన..టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు చేతిలో 9వేల ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. కొళత్తూరు నుంచి వరుసగా మూడుసార్లు గెలిచిన సీఎం ఈ ఎన్నికల్లో విజయం సాధించలేక పోయారు. 1996



తర్వాత స్టాలిన్ ఓడిపోవడం ఇదే తొలిసారి. ఎన్నికల ఫలితాల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ టీవీకే గెలుపు దిశగా దూసుకుపోతోంది. స్టాలిన్ తనయుడు ఉదయనిధి స్టాలిన్ మాత్రం ఆధిక్యంలో కొనసాగుతున్నారు. వీఎస్ బాబుకు 82 వేల పైచిలుకు ఓట్లు రాగా, స్టాలిన్‌కు దాదాపు 73 వేల ఓట్లు పోలయ్యాయి. అన్నాడీఎమ్‌కేకు చెందిన సంతానకృష్ణన్ దాదాపు 14 వేల ఓట్లతో మూడవ స్థానానికి పరిమితమయ్యారు. 1996 తరువాత డీఎమ్‌కే అధినేతకు ఓటమి ఎదురు కావడం ఇదే తొలిసారి. వీఎస్ బాబు గతంలో డీఎమ్‌కే, ఏఐఏడీఎమ్‌కే పార్టీల్లో సేవలందించారు. 2006-11 మధ్య పురసవల్కం ఎమ్మెల్యేగా పనిచేశారు. 2011 వరకూ డీఎమ్‌కే ఉత్తర చెన్నై డిస్టిక్ట్ సెక్రటరీగా కూడా ఉన్నారు. 2011 నాటి ఎన్నికల్లో కొళత్తూర్ నియోజకవర్గం ఇన్‌చార్జ్‌గా కూడా ఉన్నారు. ఆ ఎన్నికల్లో సీఎం స్టాలిన్‌కు మెజారిటీ తగ్గడంతో విమర్శల పాలయ్యారు. అనంతరం అన్నాడీఎమ్‌కేలో చేరారు. ఈ ఏడాది నటుడు విజయ్ సారథ్యంలోని టీవీకే పార్టీలో చేరారు. తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో అడుగుపెట్టిన విజయ్ సారథ్యంలోని టీవీకే విజయపథంలోకి దూసుకెళ్తోంది. అయితే మెజారిటీకి 118 సీట్లు అవసరమవుతాయి. మెజారిటీ తగ్గిన పక్షంలో ప్రభుత్వం ఏర్పాటుకు ఏయే పార్టీలతో సంప్రదింపులు జరిపే అవకాశం ఉందనే దానిపై తాజాగా సోషల్ మీడియాలో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఎన్నికల ఫలితాల అనంతరం అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకునేది లేదని టీవీకే ఇంతకుముందే ప్రకటించింది. అయితే టీవీకే మెజారిటీకి అతి దగ్గరలో ఆగిపోయిన పక్షంలో ఆ పార్టీ మద్దతు తీసుకునే అవకాశాలను తోసిపుచ్చలేమని అంటున్నారు. కాగా, సెక్యులర్ ప్రొగ్రెసివ్ అలెయెన్స్‌లో భాగంగా డీఎంకేతో కాంగ్రెస్, సీపీఎం పొత్తు పెట్టుకున్నాయి. ట్రెండ్స్ ప్రకారం కాంగ్రెస్ 5 స్థానాల్లో, సీపీఐ రెండు స్థానాల్లో, సీపీఎం ఒక స్థానంలో గెలుపునకు చేరువలో ఉన్నాయి. డీఎంకేతో కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్నప్పటికీ ఆ పార్టీలోని కొందరు టీవీకే పట్ల సానుకూలంగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో టీవీకేతో పొత్తు పెట్టుకోవాలని కాంగ్రెస్‌లోని ఒక వర్గం మొదట్నించీ పట్టుపడుతోంది. అయితే చివరి నిమిషంలో డీఎంకేతోనే కలిసి పోటీ చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో టీవీకే ప్రభుత్వం ఏర్పాటుకు కాంగ్రెస్ మద్దతు తీసుకునే అవకాశాలు బలంగా ఉన్నట్టు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

కాగా ప్రభుత్వం ఏర్పాటులో భాగంగా టీవీకే ఇటు కాంగ్రెస్‌తో పాటు ఐయూఎంఎల్, డీఎండీకే, లెఫ్ట్ పార్టీల సాయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. డాక్టర్ అన్బుమణి రామదాస్ సారథ్యంలోని పీఎంకే మద్దతును కూడా టీవీకే కూడగట్టవచ్చుని చెబుతున్నారు. ఏదిఏమైనా పూర్తి ఫలితాలు వెలువడిన తర్వాతే టీఎంకే వ్యూహరచన ఉంటుందని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి.

# అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

మొదటిపేజీ తరువాయి...

తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి గింజను కొనుగోలు చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని, చిట్టచివరి రైతు వరకూ న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని స్పష్టం చేశారు.రాబోయే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు అకాల వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున అన్ని జిల్లాల్లో ముందస్తు చర్యలు పకడ్బందీగా అమలు చేయాలని, ధాన్యం, మొక్కజొన్న సహా ప్రతి రైతు ఉత్పత్తిని కొనుగోలు చేసి చిట్టచివరి రైతుకు కూడా న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ మే నెల ధాన్యం కొనుగోలుకు అత్యంత కీలకమని, అధికారులందరూ సమన్వయంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం గా పూర్తి చేయాలని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాల కలెక్టర్లు ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత బాధ్యతతో, సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. ఈ సీజన్‌లో గత రెండు సీజన్లతో పోలిస్తే అధికంగా ధాన్యం ఉత్పత్తి నమోదైనందున, కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని, ప్రతి అంశాన్ని నిరంతరం సమీక్షిస్తూ పరిస్థితిని అదుపులో ఉంచాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏర్పడే చిన్న చిన్న సమస్యలను కూడా వెంటనే గుర్తించి పరిష్కరించేలా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే సంబంధిత ఇంచార్జి మంత్రులకు తెలియజేసి తక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా కొనసాగాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ధాన్యం రవాణాలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే స్పందించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా ముందస్తుగా చెయ్యాలని ఆదేశించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, టార్పాలిన్ల కొరత లేకుండా చూసుకోవాలని, రైస్ మిల్లర్లతో సమన్వయం పెంచాలని అన్నారు. అవసరమైన గోదాములు లేదా మార్కెట్ యార్డ్ షెడ్యూల్లో ధాన్యం భద్రపరచాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఐడీఓసీ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్‌లి అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వరి మరియు మొక్కజొన్న కొనుగోళు పూర్తి స్థాయిలో నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 92 కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం చేరుకున్నదని, వెంటనే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు పూర్తైన 24 గంటల్లోపే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని, ఎక్కడైనా సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసిన రైతులకు వారం రోజుల్లోనే వారి ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు విద్యాచందన, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కవిత పార్టీలోకి వలసలు

మొదటిపేజీ తరువాయి...

హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిసిన సీనియర్ నేత బోడ జనార్ధన్ కీలక చర్చలు జరిపారు. త్వరలోనే తన ఫ్యాన్స్, మద్దతుదారులతో కలిసి టీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో టీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని బోడ జనార్ధన్ పేర్కొన్నారు.మంచిర్యాల జిల్లా చెన్నూరు శాసనసభ నియోజకవర్గం నుంచి బోడ జనార్దన్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు ప్రభుత్వంలో కార్మిక శాఖ మంత్రిగా బోడ జనార్ధన్ పని చేశారు. సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో తెలంగాణ రక్షణ సేన పార్టీని బలోపేతం చేయడానికి.. టీఆర్ఎస్ పార్టీని విస్తరించేందుకు తన వంతు కృషి చేస్తానని బోడ జనార్ధన్ తెలిపారు.సీనియర్ నేత అయిన బోడ జనార్ధన్ టీఆర్ఎస్ పార్టీలో చేరడంతో ఆ పార్టీకి కొత్త ఉత్సాహం రానుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన బోడ జనార్దన్.. ప్రస్తుతం మంచిర్యాల జిల్లాలో ఉన్న చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున కీలక వ్యక్తిగా ఎదిగారు. రాజకీయాల్లో అనుభవం ఉన్న నేతగా టీఆర్ఎస్ పార్టీలో చేరుతుండటంపై ఆ పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది.

# దేశమంతా డబుల్ ఇంజన్ సర్కార్ ఖాయం

మొదటిపేజీ తరువాయి...

సోమవారం కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కలలు కంటున్నారని అన్నారు. సీఎం ఎక్కడికి వెళ్తే.. అక్కడ కాంగ్రెస్‌కు ఓటమినేనని ఎద్దేవా చేశారు. కేరళంలో ప్రభుత్వంపై వ్యతిరేకత ఉండటంతోనే.. ఈ ఫలితాలు కాంగ్రెస్‌కు కొంత అనుకూలంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ రావాలని ప్రజలు కోరుకున్నారని అన్నారు. బీజేపీకి అసలు ప్రచారకర్త రాహుల్ గాంధీనేననిబండి సంజయ్ సెటైర్లు గుప్పించారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన రాజకీయాలు చేసేందుకు ప్రయత్నించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తమిళనాడు సీఎం స్టాలిన్‌కు ఈ ఎన్నికల ఫలితాలు చెంపపెట్టులాంటివని బండి సంజయ్ అన్నారు. రాబోయే రోజుల్లో అన్ని రాష్ట్రాల్లోనూ మోదీ నాయకత్వంలో డబుల్ ఇంజిన్ సర్కార్లు రాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెల్లరీ దుకాణంలో జరిగిన కాల్పుల ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పాల్సింది పోయి.. ఈ ఘటనను రాజకీయ కోణంలో చూస్తున్నారని విమర్శించారు. దుకాణం యాజమాన్యంతో మాట్లాడానని, బాధితులకు అండగా నిలవాలని కోరానని అన్నారు.

# తమిళనాట విజయ్ పార్టీ విజయం ఖాయం

**ఏడాది క్రితమే జోస్యం చెప్పిన ప్రశాంత్ కిషోర్**

**ఆనాటి వీడియో సోషల్ మీడియాలో వైరల్**



న్యూఢిల్లీ,మే4 : తమిళనాడులో విజయ్ టీవీకే 98 నుంచి 120 సీట్లు గెలుస్తుందని గత ఏడాది మార్చిలో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ముందే జోస్యం చెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో దళపతి విజయ్ తాజాగా సునామీ సృష్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన గెలుపు ఖాయమని ఏడాది క్రితమే ప్రశాంత్ కిషోర్ చెప్పిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ’ఈ వీడియో దాచి పెట్టుకోండి. ఫలితాల తరువాత ప్లే చేయండి’ అని ఆ వీడియోలో ప్రశాంత్ కిషోర్ సవాలు విసిరారు.ప్రశాంత్ కిషోర్ గత ఏడాది మార్చిలో తంతి టీవీ కి ఇంటర్వ్యూ ఇచ్చారు. టీవీకే ఆవిర్భావం జరిగి అప్పటికి ఏడాది అయింది. తమిళ సూపర్‌స్టార్, టీవీకే వ్యవస్థాపకుడు విజయ్ విజయావకాశాలపై అడిగిన ప్రశ్నకు ప్రశాంత్ కిషోర్ సూటిగా సమాధానమిచ్చారు. విజయ్ ఒంటరిగా ఎన్నికల బరిలోకి వెళ్లాలని పట్టుదలగా ఉన్నారని, అందులో మార్పు ఉంటుందని తాను అనుకోనని చెప్పారు.

ఒంటిరిగా ఎన్నికల్లోకి వెళ్తే తమిళనాడులో ఆయన విజయం సాధిస్తారని అన్నారు. విజయానికి అవసరమైన 118 సీట్ల కంటే ఎక్కువే సాధిస్తారని పేర్కొన్నారు. ’ఈ వీడియాను దాచిపెట్టుకోండి... ఫలితాల తరువాత ప్లే చేయండి’ అని కూడా ఆయన ఢంకా బజాయించారు. ప్రశాంత్ కిషోర్ ’ఐ-ప్యాక్’ పొలిటికల్ స్ట్రాటజీ సంస్థ తమిళనాడులో టీవీకేతో కలిసి పనిచేసిందనే వార్తలు కూడా వచ్చాయి. విజయ్‌తో ఉన్న అసోసియేషన్‌ను ఆ ఇంటర్వ్యూలో ప్రశ్నించినప్పుడు, తాము రాజకీయ సహచరుల కంటే మంచి మిత్రులమని అన్నారు. ఐదేళ్ల క్రితం తొలిసారి తాము మాట్లాడుకున్నామని, ఆయనకు తాను రాజకీయ సలహాదారు కాదని, సిద్దాంతాలు, విలువలపై అభిప్రాయాలు పంచుకుంటూ ఉంటామని చెప్పారు.

## సంపాదకీయం

# ముంచుకొస్తున్న మంచినీటి సమస్య !

ఎండలు ముదురుతున్నాయి. ఇప్పుడే 40 డిగ్రీలకు చేరువలో ఉన్నాం. వాతావరణశాఖ కూడా ఇదే హెచ్చరిక చేస్తోంది. పశ్చిమాసియా యుద్ధం వల్ల వాతావరణంలో వేడి పెరిగిందని కూడా ఆందోళన వస్తోంది. అయితే ఇది ఎంతవరకు నిజమన్నది పక్కన పెడితే ఎండలు మాత్రం ముదురుతున్నాయి. ఇప్పటికే వేసవి మొదలు కావడంతో దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో తాగునీటి కొరత తీవ్రమైంది. 2030 నాటికి దేశంలోని 21 ప్రధాన నగరాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటే ప్రమాదం వుందని గణాంకాలు చెబుతున్నాయి. పర్యావరణ విధ్వంసం కూడా దీనికి ప్రధాన కారణం. మనం భూగర్భ జలాలను, నీటి వనరులను కోల్పోవడమే కాదు, ఉన్న నీటిని కూడా విషపూరితం చేస్తున్నామని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. స్వచ్ఛమైన నీరు అందించడం ప్రభుత్వాల బాధ్యత. ప్రజల ప్రాథమిక హక్కులను కూడా కాపాడలేని పరిస్థితిలో ప్రభుత్వాలున్నాయి. దేశంలో ఏటా 3.77 కోట్ల మంది కలుషిత నీటి వల్ల వ్యాధుల బారిన పడుతున్నారు. డయేరియా వంటి వ్యాధులతో ప్రాణాలు కోల్పోతున్నారు. లక్ష్యాలు గొప్ప వుంటే సరిపోదు, వాటి అమలు కూడా అంతే గొప్పగా వుండాలి. కాగితాలపై కనిపించే ప్రణాళికలు ఆచరణలో అమలుకు నోచుకోవాలి. పారదర్శకత లేని వ్యవస్థలో ప్రజాప్రయోజనం కనిపించదని తెలుసుకోవాలి. ఈ క్రమంలో ప్రజలు జాగరూకులై ఉండాల్సిందే. ఏటా ఎండాకలం అనగానే మంచినీటి సమస్య, సాగునీట సమస్యలు వస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా పక్కా ప్రణాళికలు లేకపోవడం వల్ల ఈ సమస్యలు వస్తున్నారు. దేశవ్యాప్తంగానూ, తెలుగు రాష్ట్రాల్లోనూ సాగు,తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. చివరి భూములకు నీరు అందక అప్పుడే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం అనేక జిల్లాల్లో సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే చర్యలు చేపట్టడం లేదు. జనాభా పెరుగుదల కారణంగా నీటి సరఫరా సమస్యలు వస్తున్నాయి. నీటి వనరులు లేని ప్రాంతాల్లో తీవ్రమైన నీటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇది సామాజిక, ఆర్థిక అభివృద్ధిని ప్రభావితం చేస్తున్నది. భవిష్యత్తరాలకు సురక్షిత నీటిని అందించాలన్న లక్ష్యం నీరుగారి పోతోంది. నీటిని సంరక్షించుకోకపోతే, భవిష్యత్ అంధకారమౌతుందని, జీవకోటి మనుగడ ప్రశ్నార్థకమవుతుందని గుర్తించడం లేదు. భూమిలో బోర్లు వేసి నీటిని తోడుతున్నా, నీటిని రీఛార్జ్ చేయలేక పోతున్నాం. మానవాళి మనుగడకు నీరే ప్రాణాధారం. అని గుర్తించి అందుకు అనుగుణంగా గట్టి చర్యలు తీసుకోవడం లేదు. నీరు లేకుండా జీవం లేదు. నీటి లభ్యత వున్న నదీ పరివాహక ప్రాంతాలు, తీరప్రాంతాల్లోనే ప్రాచీన నాగరికతలు, ఆధునిక సమాజాలు అభివృద్ధి చెందాయి. భవిష్యత్‌లో ఎదురయ్యే నీటి సంక్షోభాలను అధిగమించేందుకు, ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నాలు జరగడం లేదు. నేటికీ ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల మందికి పైగా ప్రజలకు రక్షిత తాగునీరు అందుబాటులో లేదు. నీటి సమస్య ముందుగా బాధించేది మహిళలనే. ఇప్పటికీ ట్రైబల్ ఏరియాలో నీటికోసం నానా అవస్థలు పడుతున్నారు. ప్రతిరోజూ 20కోట్ల మంది భారతీయులు సుదూరాలకు నడిచివెళ్లి నీటిని తెచ్చుకుంటున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. వీరిలో అత్యధికులు మహిళలు, బాలికలే. ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా రక్షిత మంచినీరు అందిస్తామని 2019లో ఆర్భాటంగా 'జల్ జీవన్ మిషన్' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం 2024 నాటికి పూర్తికావాల్సి వుండగా, చాలా రాష్ట్రాల్లో అసలు అమలుకే నోచుకోలేదు. దీంతో ఈ పథకం కాలపరిమితిని 2028 వరకూ పొడిగించడంతో పాటు, కేటాయింపులను కూడా రూ.8.69 లక్షల కోట్లకు పెంచుతూ ఇటీవల ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో మిషన్ భగీరథ పేరుతో భారీ కుంభ కోణం చేసిన గత బిఆర్ఎస్ పాలకులు దానిని కప్పిపుచ్చుకునేందుకు నానా గడ్డీ కరుస్తున్నారు. చెరువుల పునరుద్ధరణ, మిషన్ భగీరథ పేరుతో వేలకోట్లు దండుకున్నారు. మనకు జీవనదులు, సహజ నీటి చెరువులు పుష్కలంగా ఉన్నా వాటి నీటిని పూర్తిస్థాయిలో వాడుకునేలా ప్రయత్నాలు జరగడం లేదు. జరిగే ప్రయత్నాల వెనక భారీ కుంభకోణాలు దాగి వుంటున్నాయి. జల్ జీవన్ మిషన్ సహా ప్రభుత్వ నీటి పథకాలన్నిటినీ చిత్తశుద్ధితో అమలు చేస్తే, బొట్టు బొట్టు భద్రం చేస్తే.. ప్రజలు నీటి గండం నుంచి గట్టెటెక్కుతారు. నదీ జలాలలను సక్రమంగా పొలాలు, ఇళ్లకు మళ్లించేలా ప్రణాకలు చేపట్టలి. రాష్ట్రాల మధ్య జలజగడాలను ఆపి, నీటి సద్వినియోగం చేసుకోవాలి. ఏటా లక్షల క్యూసెక్కులు సముద్రం లో కలిసి పోకుండా ప్రణాళికులు చేపట్టాలి. అప్పుడే సాగు, తాగునీటి సమస్యలకు చెక్ పడుఉతంది.

## రామన్నపేటలో ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ ఆందోళన



యాదాద్రి భువనగిరి : ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ ఆందోళన చేపట్టిందన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో చిట్యాల-భునగిరి రహదారిపై ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నాకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి రహదారిపై వడ్లు పోసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి రైతులు పంటలు పండిస్తే ప్రభుత్వ అసమర్థతో పంటలు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంటలు వర్షాలకు తడిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనకు నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మద్దతు తెలిపారు.

## యాదగిరిగుట్టలో బీర్ల అయిలయ్య దిష్టిబొమ్మ దహనం



యాదగిరిగుట్ట, : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావుపై ప్రభుత్వవిప్ బీర్ల అయిలయ్య చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసిస్తూ బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సోమవారం పట్టణంలో ప్రధాన రోడ్డుపై నిరసన ర్యాలీని చేపట్టారు. ఖబర్ధార్ అయిలయ్య, బీర్ల అయిలయ్య డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ప్రధాన కూడలి వద్ద, అయిలయ్య దిష్టిబొమ్మ దహనం చేశారు. 6 సార్లు ఎమ్మెల్యేగా, ఇరిగేషన్ శాఖ, ఆర్థికశాఖ, వైద్యారోగ్యశాఖ మంత్రిగా ఈ రాష్ట్రానికి సేవ చేసిన మాజీ మంత్రి హరీశ్ రావు హోదాను మరిచి, అధిష్ఠానం మెప్పుకోసం నోటికి వచ్చినట్టుగా మాట్లాడితే సహించేది లేదన్నారు. మాట్లాడేటప్పుడు ఆలోచించి మాట్లాడాలన్నారు. అధికారంలో ఉన్నమని విర్రవీగి నోరు జారితే తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఇప్పటివరకు వరిధాన్యంకొనుగోళ్లు కేంద్రాల్లో 30 శాతం వడ్లను కొనుగోలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో రైతులే కర్రకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే అయిలయ్య వెంటనే హరీశ్ రావుకు క్షమాపణలుచెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ మాజీ సెక్రటరి జనరల్ పాపట్ల నరహరి, యువజన విభాగం నాయకులు ముక్కర్ల సతీష్ యాదవ్, బాలయ్య, సర్పంచ్ గడ్డం దేవేందర్, మాజీ సర్పంచ్ తోటకూరి బీరయ్యలు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 103 ఫిర్యాదులు



నిజామాబాద్, మే 04, (తెలంగాణ వాణి ప్రతినిధి) : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 103 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఆర్డీఓ సాయన్న, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కాగా, సబ్ కలెక్టర్, ఆర్డీఓల నేతృత్వంలో డివిజన్ స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత డివిజన్ పరిధిలోని తహసీల్దార్ లు పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌వాయిలో పెండ్లి తంతు ముగించుకుని తిరిగి వెళ్తుండగా కారు బోల్తా.. పలువురికి గాయాలు

కామారెడ్డి : పెండ్లి తంతు ముగించుకొని తిరిగి వెళ్తుండగా కారు బోల్తా పడిన ఘటన సోమవారం ఉదయం ఉప్పల్ వాయి గ్రామంలో చోటు చేసుకుంది. రామారెడ్డి ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. మాచారెడ్డి మండలం సోమర్ పేట్ లో వివాహ కార్యక్రమం పూర్తి చేసుకుని గాంధారి కి ఆరుగురితో సోమవారం ఉదయం 3 గంటలకు వెళుతున్న కారు ఉప్పల్ వాయి గ్రామంలో అదుపు తప్పి పశువుల పాకను ఢీకొట్టింది. ఈ ఘటనలో గేదెలు అక్కడికక్కడే మృతి చెందగా మరో గేదెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురికి గాయాలయ్యాయి. కాగా మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. గమనించిన స్థానికులు, పోలీసులు బాధితులను వెంటనే కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్ లో తరలించారు. గాయపడిన వారి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మహిళా సంఘ భవనానికి ఎమ్మెల్యే భూమి పూజ



జగిత్యాల:మే 4(తెలంగాణ వాణి ప్రతినిధి): జగిత్యాల రూరల్ మండలం తిప్పన్నపేట గ్రామంలో 10 లక్షలతో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి సోమవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, భూమి పూజ చేశారు అనంతరం గ్రామానికి చెందిన పోతు మానస సాగర్ ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై చీర కానుకగా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత కోసం కృషి చేస్తుందని అన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలను అందిస్తూ, వివిధ రంగాల్లో మహిళా భాగస్వామ్యం కల్పిస్తూ,ప్రోత్సహిస్తూ మహిళలను కోటీశ్వరులను చేయాలని ప్రభుత్వం చిత్తశుద్ధిగా ఉందని అన్నారు.జగిత్యాల జిల్లా లో ఐదు కోట్లతో ఇందిరా మహిళా శక్తి భవనాన్ని నిర్మిస్తున్నామని అన్నారు. ముఖ్య మంత్రి యువతకు ఉపాధి అవకాశాలు కల్పన కోసం అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్ ను 6 కోట్లతో జగిత్యాల లో నిర్మించడం జరిగిందని వెల్లడించారు.యువత ఉపాధి కోసం వృత్తి విద్యారంగాల్లో అవకాశాలు ఉంటాయని, సద్వినియోగం చేసుకోవాలి అన్నారు.జగిత్యాల మహిళ డిగ్రీ కళాశాల అటానమస్ అయిందని, మహిళల కు నూతన వృత్తి విద్యా కోర్సులు అందుబాటులో ఉన్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ దావా తిరుపతి, ఉప సర్పంచ్ స్వతంత్ర మహేశ్, మాజీ ఎంపీపీ ములసపు లక్ష్మీ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి

**ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి**
**జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



జగిత్యాల (తెలంగాణ వాణి) ప్రజావాణికి వచ్చిన అర్జీలపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ లతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తున్నారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యలపై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 76 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జనాభ లెక్కల – స్వీయ గణన -2027 పై జిల్లా స్థాయి అధికారులకు సోమవారం సాయంత్రం ప్రతి ఉన్నతాధికారి తమ కింది స్థాయి ఉద్యోగుల వరకు అందరు సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు..

### ప్రత్యేక మొబైల్ యాప్ ప్రారంభించిన మంత్రి తుమ్మల



తాండూరు: కాంగ్రెస్ పాలనలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా తాండూరులో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 4 నుంచి మే 9 వరకు నిర్వహించే రైతు వారోత్సవాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'టీజీ ఆర్గానిక్స్' అనే ప్రత్యేక మొబైల్ యాప్ ను ఆవిష్కరించారు. సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శన కేంద్రాన్ని ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. ముందెన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయంలో ఆధునిక విప్లవాత్మక విధానాలు అమలు చేస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి మరియు రైతులు–వినియోగదారుల మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని నెలకొల్పడానికి 'టీజీ ఆర్గానిక్స్' మొబైల్ యాప్ ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ యాప్ లో తెలంగాణ స్టేట్ సీడ్ అండ్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ ద్వారా ధృవీకరించబడిన రైతుల ఉత్పత్తులు మాత్రమే అందుబాటులో ఉంటాయని తెలిపారు. తద్వార కల్తీ లేని అసలైన ఆర్గానిక్ ఆహారం దొరుకుతుందన్నారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా రైతుల నుంచి తాజా కూరగాయలు, పండ్లు, ధాన్యాలను కొనుగోలు చేయవచ్చన్నారు. వినియోగదారులు తమకు 50 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఆర్గానిక్ రైతులను వెతుక్కుని వారి ఉత్పత్తులను కొనుగోలు చేయువచ్చని తెలిపారు. ముఖ్యంగా మధ్యవర్తుల ప్రమేయం లేకపోవడం వల్ల, రైతులు తమ పంటకు సరైన ధరను పొందవచ్చన్నారు. ఈ యాప్‌లో త్వరలో మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. తాండూరులో కంది బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. దేశానికే తెలంగాణ అన్నం పెడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం యూరియా విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని పేర్కొన్నారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయం దండుగ కాదు పండుగ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు సంబురంగా వ్యవసాయం చేసుకుంటున్నారని తెలిపారు. రైతలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. తాండూరు నియోజకవర్గంలో కోట్పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టుల ద్వారా సాగు నీరు అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తామన్నారు. ప్రాణహిత చేవెళ్ల–పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టులను త్వరితగతిన నిర్మించి రైతుల పొలాలకు నీరు అందిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలా ఉత్తుత్తి శిలాపలకలు వేయలేమన్నారు. అభివృద్ధికి చక్కటి బాటలు వేస్తున్నామన్నారు. అనంతరం యాలాల మండలం జుంటుపల్లి సమీపంలోని ఆయిల్ ఫాం తోటను నేతలు, అధికారులు పరిశీలించారు.

రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు..: తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ రాష్ట్రంలోని 2601 రైతు వేదికల్లో వ్యవసాయంలో మంచి లాభాలు, ఉత్పత్తులు తీసుకువచ్చేందుకు వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల ద్వార ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వడంతోపాటు రైతుల నుంచి కూడ సలహాలు స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాల ద్వార రైతులకు లాభాలు చేకూరే విధంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా డ్రోన్ల ద్వారా మందుల పిచికారి, ఆయిల్ ఫాం తోటల పై కూడా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వికారాబాద్ జిల్లా ఆయిల్ ఫాం విస్తీర్ణంలో మూడవ స్థానం, పండ్లు, కూరగాయల విస్తీర్ణంలో రెండో స్థానంలో ఉందని తెలిపారు. ఆయిల్ ఫాం, పండ్ల తోటలకు ప్రభుత్వం సబ్సిడీని కూడా ఇస్తుందన్నారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర లభించేందుకు రైతు కొనుగోళు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. 'టీజీ' ఆర్గానిక్స్' అనే ప్రత్యేక మొబైల్ యాప్ ప్లే స్టోర్ లో ఉందని తెలిపారు. రైతులకు ఈ యాప్ చాల మంచిగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కల్వ సుజాత, తాండూరు మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధారసింగ్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## అరణ్యంలో క్షుద్ర పూజల కలకలం..

**కాటుక, దువ్వెన, కోడిని చూసి షాక్‌కు గురైన స్థానికులు!**

ఖానాపురం: వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని పాకాల అభయారణ్యం పరిసర ప్రాంతాల్లో క్షుద్ర పూజలు కలకలం రేపుతున్నాయి. మూడు నెలల క్రితం కూడా క్షుద్ర పూజలు జరిగినట్లు స్థానికులు గుర్తించారు. కాగా, ప్రస్తుతం మళ్లీ క్షుద్ర పూజలు నిర్వహిస్తున్నట్లు అక్కడ తతంగం చూస్తే తెలుస్తోంది. చిన్న పిల్లలు వాడే కాటుక, దువ్వెన లాంటి కిట్ ఒకటి, కుంకుమ, నిమ్మకాయలు, కోడి సహా మరికొన్ని ఉండటం అనుమానాలకు తావిస్తోంది. కాగా పాకాల ప్రాంతంలో క్షుద్ర పూజలు ఎందుకోసం నిర్వహిస్తున్నారు. నిర్వహించేవారు స్థానికులా లేదా బయటి ప్రాంతం వ్యక్తులా.. ఈ పూజల వెనుక మర్మం ఏమిటి అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎండాకాలం కావడంతో చిన్న పిల్లలు, యువకులు పలు గ్రామాల నుండి ఈత కోసం పాకాల కాలువలకు రావడం సాధారణం. ఈ క్రమంలో క్షుద్ర పూజలు తరచుగా చోటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారుతోంది.

మూఢ నమ్మకాలే పెట్టుబడి..: నర్సంపేట డివిజన్ వ్యాప్తంగా గత కొన్ని నెలలుగా దోషాలు తొలగిస్తామని, పెళ్లి జరిగేలా చేస్తామని, సంతాన ప్రాప్తి కలిగిస్తామని కొందరు వ్యక్తులు పూజారుల అవతారం, కోయ దొరల అవతారంలో పదుల సంఖ్యలో తిరుగుతున్నారు. పూజల పేరిట వేల రూపాయలు పేద భక్తుల నుంచి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు సైతం వినపడుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని బాధిత జనాలు కోరుతున్నారు.



# అత్యాచారం కంటే వరకట్న మరణాలే ఎక్కువ..

బయట ఎలాగూ భద్రత లేదు.. అమ్మ కడుపులో కూడా సెక్యూరిటీ లేకపోతే ఎలాగమ్మా.. కార్తికేయ సినిమాలో గర్భవిచ్చితి చేసుకోవడానికి వచ్చిన ఓ మహిళలను ఉద్దేశించి హీరో పలికే డైలాగ్ అది. అది కేవలం సినిమా డైలాగ్ గా మాత్రమే చూడకూడదు. తరాలు మారినా.. యుగాలు మారినా.. అంతరిక్షంలోకి దూసుకెళ్తున్నా సరే సమాజంలో పాతుకుపోయిన కొన్ని దురాచారాలు మాత్రం అంతమవడం లేదు. వీటిల్లో ప్రధానంగా చెప్పుకోవాల్సింది వరకట్న దురాచారం. నేటి రాకెట్ యుగంలో కూడా వరకట్న వేధింపుల వల్ల ఎందరో మహిళలు బలువుతున్నారు. తాజాగా ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో అదనపు కట్నం కోసం భర్త, అత్తింటి వారు కలిసి మహిళను అత్యంత దారుణంగా హత్య చేసిన సంగతి తెలిసిందే. అలానే రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌కు చెందిన ఓ ప్రభుత్వ టీచర్ వరకట్న వేధింపులు తాళలేక తన కూతురితో సహా ఆత్మహత్య చేసుకుంది.ఎందుకంటే బయట సమాజంలో పరిస్థితి ఇప్పుడు అంతకంటే దారుణంగా ఉంది. ఆడవాళ్లు అంటే అలుసుగా.. కడుపులో నలుసుగా చూస్తున్న క్రమంలో.. గర్భ విచిత్తులు పెరిగిపోతున్నాయి. తద్వారా ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతుంది. దీంతో లింగ నిష్పత్తి లో విపరీతమైన అంతరాయం ఉండడంతో చాలామంది అబ్బాయిలకు వివాహాలు జరగడం లేదు.గడిచిన కొంతకాలంగా రెండు తెలుగు రాష్ట్రాలలో మాత్రమే కాకుండా యావత్ దేశం మొత్తం అమ్మాయిల కొరత విపరీతంగా ఉంది. పెళ్లీడుకొచ్చిన అబ్బాయిలకు అమ్మాయిలు దొరకడమే కష్టంగా మారింది. ఫలితంగా చాలామంది బ్రహ్మచారులుగానే మిగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే చాలామంది తమకు పెళ్లి జరిగితే చాలు అనే స్థాయికి దిగజారి పోయారు. కట్నాలు డిమాండ్ చేస్తే స్టేజి నుంచి ఎదురు కట్నం ఇచ్చే వరకు యువకుల పరిస్థితి మారిపోయింది. ఇంత చేసినప్పటికీ చాలామందికి పెళ్లి జరగడం లేదు.ఈ పెళ్లిళ్ల సంగతి కాస్త అటు పెడితే.. వివాహం జరిగిన తర్వాత అత్తింటి వారింట్లో అమ్మాయిలకు ఏమాత్రం భద్రత ఉండటం లేదు. ఇదేదో మేము చేస్తున్న ఆరోపణ కాదు.. టిడిపి పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి లోక్సభలో ప్రశ్న అడిగారు. దానికి కేంద్ర మంత్రి బండి సంజయ్గ్గ్భాంతికరమైన వాస్తవాన్ని వెల్లడించారు.రెండు తెలుగు రాష్ట్రాలలో గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో 1304 మంది మహిళలు వరకట్నం వేధింపులతో మరణించారట. 2019 నుంచి 2023 వరకు ఆంధ్రప్రదేశ్లో 526.. తెలంగాణ రాష్ట్రంలో 776 కేసులు నమోదయ్యాయి. ఇక శిక్షల ఖరారు రేటు ఆంధ్రప్రదేశ్లో 11.5.. తెలంగాణలో 14.4% గా ఉంది. వరకట్న మరణాలలో ఉత్తర ప్రదేశ్, బీహార్ రాష్ట్రాలు టాప్ స్థానంలో ఉన్నాయి. ఇక 2023లో దేశవ్యాప్తంగా 6156 మంది మహిళలు వరకట్నం వేధింపుల వల్ల చనిపోయారు. ఇందులో కొంతమంది ఆత్మహత్య చేసుకుంటే.. మిగతావారు హత్యకు గురయ్యారు.దేశంలో అత్యాచారాల కంటే వరకట్న మరణాలే ఎక్కువ అని వెల్లడించింది. ప్రతిరోజు సగటున 19 మంది మహిళలు వరకట్నా దాహానికి బలైపోతున్నారు. 2017-2022 మధ్య ఏటా 6,516 వరకట్న మరణాలు సంభవించాయి. 2024లో నమోదైన కేసుల్లో 17 శాతం వరకట్న వేధింపుల కేసులే. బాధితులకు సత్వర న్యాయం అందడం లేదని నివేదికలు చెబుతున్నాయి.ఈ క్రమంలో హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ క్రైమ్ బ్యూరో రికార్డ్స్ సంచలన విషయాలు వెల్లడించింది. దేశంలో అత్యాచార ఘటనల కన్నా వరకట్న మరణాలే అధికంగా ఉన్నాయని.. ప్రతి రోజు సగటున 19 మంది మహిళలు వరకట్న దాహానికి బలైపోతున్నారని ఎన్‌సీబీఆర్ వెల్లడించింది. దేశంలో వరకట్న నిషేధ చట్టం అమలులో ఉన్నా సరే దారుణాలు మాత్రం ఆగడం లేదు.బ్యూరో వెల్లడించిన తాజా వివరాల ప్రకారం 2017-2022 సంవత్సరాల మధ్య దాదాపు ప్రతి ఏడాది భారత్‌లో 6,516 వరకట్న మరణాలు చోటుచేసుకుంటున్నాయి. రేప్, సామూహిక అత్యాచారం తరువాత హత్యకు గురై చనిపోయిన ఆడవారి కంటే ఈ మరణాలు 25 రెట్లు ఎక్కువ అని నివేదిక వెల్లడించింది. ఇదిలా ఉంటే 2024 సంవత్సరంలో నమోదైన 25,743 కేసుల్లో.. 4,383 కేసులు వరకట్న వేధింపుల మీద నమోదైనవే. అంటే మొత్తం నమోదైన కేసుల్లో 17 శాతం కేసులు వరకట్న వేధింపుల కేసులే ఉండటం గమనార్హం.వరకట్న వేధింపుల కేసుల విషయానికి వస్తే ఉత్తర భారతదేశంతో పోలిస్తే దక్షిణాదిలో ఈ కేసుల సంఖ్య తక్కువగా ఉంది. అలానే నగరాల్లో కూడా వరకట్న వేధింపుల కేసులు అధిక సంఖ్యలో నమోదవుతున్నాయి. దేశంలోని మొత్తం 19 నగరాల్లో ఢిల్లీలో అత్యధికంగా 30 శాతం వరకట్న వేధింపుల కేసులు నమోదవు తున్నాయి. ఆ తర్వాత స్థానాల్లో కాన్పూర్, బెంగళూరు, లక్నో, పాట్నా వంటి నగరాలు ఉన్నాయి. వరకట్న వేధింపులకు గురైనన వారిలో ప్రతి మూడో మహిళ మరణిస్తున్నదని నివేదిక తెలిపింది.బాధితులు చివరి వరకు కూడా న్యాయపరమైన సహాయాన్ని కోరడంలో వెనుకడుగు వేస్తుండటమే ఇందుకు కారణమని నిపుణులు తెలిపారు. అలానే ఈ కేసుల్లో సత్వర న్యాయం లభించడం లేదు. వేలాది కేసులు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. బాధితులు కూడా ఈ కేసుల్లో న్యాయ సహాయం కోరడంలో వెనకడుగు వేస్తుండటం వల్ల చాలా వరకు కేసులు తెర మీదకు రావడం లేదంటున్నారు.

## ప్రజావాణిలో సమస్యలపై
# సర్పంచులు వినతి



కారేపల్లి మే 4 : ఖమ్మం జిల్లా కారేపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణిలో మండలానికి చెందిన పలువురు సర్పంచులు పలు సమస్యలపై అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ గ్రామపంచాయతీలకు చెందిన సర్పంచులు ఈ వినతి పత్రాలను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ కోమట్ల గూడెం రెవెన్యూలో గల 277 సర్వే నెంబర్లో ఇటీవల అధికారులు సర్వే చేసి 3.22 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారననారు. ఆ స్థలంలో ఒక ఎకరం భూమిని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామాలలో నిర్మించిన సిసి రోడ్లకు ఇరువైపులా మట్టితో నింపేందుకు చెరువుల నుండి మట్టి తోలకాలు జరుపుకునేందుకు సంబంధిత శాఖ అధికారులు అనుమతి ఇవ్వాలని కోరారు. ఇటీవల వీచిన గాలి దుమారానికి అనేక గ్రామపంచాయతీలలో చెట్లు నేలకొరిగాయని, పెద్ద ఎత్తున బొమ్మలు విరిగి రోడ్లపై పడ్డాయి అన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తూ అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను పంచాయతీ సిబ్బందితో తొలగిస్తుంటే అటవీశాఖ అధికారులు కేసులు పెడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

## మే చివరి వారం లేదా జూన్ లో
# పంచాయితీ పోల్స్ కు ఏర్పాట్లు



విజయవాడ, : ఆంధ్రప్రదేశ్‌లో సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 13,100 గ్రామ పంచాయతీల్లో సర్పంచులు, వార్డు సభ్యుల పదవీకాలం ముగియడంతో పాలన మొత్తం ప్రత్యేక అధికారుల చేతుల్లోకి వెళ్ళింది.ప్రభుత్వం ఈ వేసవి లోనే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ రాజ్ వ్యవస్థ మళ్ళీ పట్టాలెక్కే సమయం ఆసన్నమైంది. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో, క్షేత్రస్థాయిలో పాలన స్తంభించకుండా ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. అయితే, గతంలో ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి సుదీర్ఘకాలం అధికారుల పాలనను కొనసాగించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృఢ నిశ్చయంతో ఉన్నారు. వీలైనంత త్వరగా అంటే.. మే లేదా జూన్ నెలల్లోనే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో పాఠశాలలకు వేసవి సెలవులు ఉండటంతో, ప్రభుత్వ భవనాలు, ఉపాధ్యాయుల సేవలను ఎన్నికల విధులకు వినియోగించుకోవడం సులభతరం అవుతుంది. ఇదే తరుణంలో ఎన్నికలు నిర్వహిస్తే అటు విద్యా సంవత్సరంపై ప్రభావం ఉండదని, ఇటు వర్షాకాలం మొదలవ్వకముందే కొత్త పాలకవర్గాలు కొలువు తీరుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం దీనిపై ప్రాథమిక కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం.వార్డుల పునర్విభజన , రిజర్వేషన్ల ప్రక్రియ అత్యంత కీలకంగా మారింది. 2024 అసెంబ్లీ ఎన్నికల నాటి భారీ విజయం తర్వాత వస్తున్న ఈ స్థానిక ఎన్నికలను కూటమి పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. జనసేన, బీజేపీలతో కలిసి రిజర్వేషన్ల కేటాయింపులో ఎక్కడా వివాదాలు రాకుండా సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ సాంకేతిక ప్రక్రియ మే నెలలో పూర్తి చేసి, జూన్ కల్లా పోలింగ్ నిర్వహించేలా కార్యాచరణ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.ప్రతిపక్ష వైసీపీ కూడా ఈ ఎన్నికలపై గట్టి ఆశలే పెట్టుకుంది. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత తమ క్యాడర్‌లో మళ్ళీ ఉత్సాహాన్ని నింపాలంటే స్థానిక సంస్థల ఎన్నికలే సరైన వేదిక అని వైఎస్ జగన్ భావిస్తున్నారు. అయితే, అధికార పార్టీపై సానుకూలత ఉన్న సమయంలోనే ఎన్నికలకు వెళ్లడం ద్వారా మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవాలని టీడీపీ భావిస్తోంది. ఉపాధి హామీ నిధులు, గ్రామాలకు వచ్చే కేంద్ర నిధులను సక్రమంగా వినియోగించాలంటే ఎన్నికైన పాలకవర్గాలే ఉండాలన్నది కేంద్ర ప్రభుత్వ నిబంధన కూడా దీనికి ప్రధాన కారణం. వేసవి సెలవుల లోపు నోటిఫికేషన్ విడుదల కాకపోతే, జూలైలో వర్షాలు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే ప్రమాదం ఉంది. అందుకే, సెక్షన్ 14 కింద ఉన్న అధికారాలను ఉపయోగించి, వీలైనంత వేగంగా ఓటర్ల జాబితాల సవరణ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

# వలస నేతలే దిక్కా



హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్‌లో ఇప్పుడు వలస నేతల హవానే నడుస్తోంది. ఎక్కడ చూసినా వాళ్ళే కనిపిస్తున్నారు. మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి నుంచి మొదలు.. ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్, కాలె యాదయ్య, మనోహర్ రెడ్డి.. ఇలా ఒకరేమిటి జిల్లాలో పొలిటికల్ హేమా హేమీలని చెప్పుకునే వాళ్ళలో ఎక్కువ మంది ఇప్పుడు హస్తం గూటికే చేరారు. వాళ్ల పార్టీ మారడం సంగతి ఎలా ఉన్నా? ఆ తర్వాతే అసలు చిక్కులు మొదలయ్యాయట. నాయకుల వెనకే వచ్చిన అనుచరుల పరిస్థితి ఇప్పుడు త్రిశంకు స్వర్గంలో ఉన్నట్టయిందని అంటున్నారు. పార్టీ జిల్లా, డివిజన్, వార్డు కమిటీల్లో తమ వారికి పదవులు ఇప్పించుకుందామంటే? పీసీసీ పెట్టిన త్రీ ఇయర్స్ రూల్ ప్రతిబంధకంగా మారింది. పార్టీలో కనీసం మూడేళ్లు పనిచేస్తేనే పదవి ఇవ్వాలన్నది రూల్. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు అధిష్టానం నుంచి ఉన్న క్లియర్ కట్ లైన్ ఇది. 2023 ఎన్నికల కంటే ముందు నుంచి ఎవరైతే పార్టీని నమ్ముకుని ఉన్నారో, వారికే ప్రస్తుత కమిటీల్లో చోటు కల్పించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. జంపింగ్ జపాంగ్‌లకు పార్టీలోకి వచ్చిన వెంటనే పదవులు ఇస్తే.. మొదటి నుంచి కష్టపడ్డ వారికి అన్యాయం జరుగుతుందని భావిస్తోంది అధిష్టానం.దీంతో ఏళ్ల తరబడి జెండా మోసిన పాత కాపులు ఖుషీ అవుతుంటే.. వలస నేతల కేడర్‌లో మాత్రం నిరాశ పెరుగుతోందట. పదవులు లేకపోతే పార్టీలో మా ఉనికి ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. మహిళా నేతల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నట్టు తెలిసింది. ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి భార్య సునీత మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆమె అప్పుడప్పుడు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నా? కీలక పదవి కోసం ఎదురు చూస్తున్నట్టు చెబుతున్నారు అనుచరులు. ప్రస్తుత మేడ్చల్ జిల్లా, రంగారెడ్డి జిల్లాల్లో మున్సిపల్ చైర్ పర్సన్స్, కార్పొరేషన్ మేయర్లుగా పని చేసిన నాయకురాళ్లు చాలామంది హస్తం పార్టీలో పదవుల కోసం లాబీయింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. కానీ?. పీసీసీ త్రీ ఇయర్స్ కండిషన్స్‌తో వారంతా ఇంకొద్ది కాలం వేచి చూడాల్సిన పరిస్థితి. ఈ నిబంధనపై కొత్తగా చేరిన నేతలు లోలోపల రగిలిపోతున్నారట. వచ్చీ రాగానే మంత్రి పదవులు ఇవ్వడానికి లేని రూల్స్.. పార్టీ కమిటీ పదవులకు ఎందుకన్నది వారి ప్రధాన ప్రశ్న. కీలకమైన స్థానిక కమిటీల్లో తమ వారికి ప్రాధాన్యత లేకపోతే.. రేపు ఎన్నికల సమయంలో కేడర్‌ను ఎలా కంట్రోల్ చేస్తామంటూ వాదిస్తున్నారు. పదవులు లేకుంటే కొత్త చేరికలు ఎలా ఉంటాయని అధిష్టానాన్ని నిలదీస్తున్నారు వలస నేతలు. పాత-కొత్త నేతల మధ్య మొదలైన ఈ చిచ్చు.. జిల్లాలో పార్టీ పటిష్టతకు దెబ్బతీస్తుందా? లేక అధిష్టానం ఏమైనా సడలింపులు ఇస్తుందా? అనేది ఇప్పుడు ఉమ్మడి రంగారెడ్డి కాంగ్రెస్‌లో హాట్ టాపిక్.

## ఘనంగా శ్రీ లింగమంతుల స్వామి జాతర మహోత్సవం
### హాజరైన 'ప్రభుత్వ విప్'

నకిరేకల్ ( తెలంగాణ వాణి) నకిరేకల్ మండలం నెలిబండ గ్రామంలో శ్రీ శ్రీ లింగమంతుల స్వామి జాతర మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నకిరేకల్ శాసనసభ సభ్యుడు, ప్రభుత్వ విప్ శ్రీ వేముల వీరేశం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులతో కలిసి జాతర ఉత్సవాల్లో పాల్గొని, భక్తులకు దేవుని పట్ల భక్తిభావం ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. జాతర మహోత్సవాలు మన గ్రామీణ సంప్రదాయాలకు ప్రతీక. ఇలాంటి ఉత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాఘవులు , నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రజిత - శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు అధికారులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో జాతర మహోత్సవంలో పాల్గొన్నారు.



# మావిగన్ తో జగన్ కు బంపర్ మైలేజ్



విజయవాడ,: వైసీపీ ట్రెడిషనల్ పాలిటిక్స్ కి దూరంగా ఉండే పార్టీ. ఒక భిన్నమైన వైఖరితో సాగే పార్టీ. ప్రచారం విషయంలో చూస్తే ఆ పార్టీ తీరే వేరుగా ఉంటుంది. అవతల ప్రత్యర్థి టీడీపీ అయితే పబ్లిసిటీ విషయంలో చాలా స్పీడ్ గా ఉంటుంది. పైగా వ్యూహాలు ఎత్తుగడలలో టీడీపీని మించిన వారు ఉండరు. అలాంటి పార్టీతో వైసీపీ ఎపుడూ పోటీపడలేని స్థితిలోనే ఉంటుంది.అలాంటివి వైసీపీ మావి గన్ అన్న ఒకే ఒక్క స్టెప్ తో ఏకంగా వంద కోట్ల రూపాయిల విలువ చేసే పబ్లిసిటీని ఫ్రీగా కొట్టేసిందా అన్న చర్చ అయితే సాగుతోంది. మావిగన్ అన్నది వైసీపీ కాకతాళీయంగా అన్నదా లేక మనసులో ఉంచుకుని సరైన సమయంలో వదిలిన పంచ్ నా లేక టీడీపీ కూటమి అమరావతి రాజధాని అన్న బలమైన స్లోగన్ ని ఎంతో కొంత అడ్డుకునేందుకు వేసిన పాచికా అన్నది తెలియదు కానీ మావిగన్ మాత్రం జగన్ నోటివెంట రాగానే సోషల్ మీడియా మొత్తం షేక్ అయింది. అంతే కాదు ఏపీ రాజకీయమంతా మొదటషాక్ అయింది ఆ మీదట హీటెక్కిపోయింది. ఇకమావిగన్ అన్నది ట్రెండింగ్‌లోఉంటూ ట్రోలింగ్ కా బాప్ అనిపించుకుంది. ఇది నెగిటివ్ ప్రచారమా లేక పాజిటివ్ ప్రచారమా అన్నది పక్కన పెడితే వైసీపీని ఎక్కడో తీసికెళ్ళి పెట్టింది అన్నది మాత్రం వాస్తవం అని అంతా అంటున్నారు. వైసీపీ అధినేత 2017 లో నిర్వహించిన భారీ పాదయాత్ర సమయంలో వైసీపీకి వచ్చిన హైప్ పొలిటికల్ గా హైలెట్ అయిన తీరు అందరికీ తెలిసిందే. ఆ తరువాత అంతటి పొలిటికల్ వైబ్రేషన్స్ అయితే వైసీపీకి ఎక్కడా రాలేదు. అధికారంలో ఉన్నపుడు కానీ గడచిన రెండేళ్ళ విపక్ష పాత్రలో కానీ వైసీపీ డిఫెన్స్ మోడ్ లో ఉంటోంది. చాలా సార్లు సైలెంట్ మోడ్ నే నమ్ముకుంది. ఇక అనేక సార్లు కార్నర్ అవుతూ వస్తోంది. కానీ ఇన్నేళ్ళ తరువాత మళ్లీ నాటి హైప్ వైసీపీకి క్రియేట్ అయింది అంటే దానికి వన్ అండ్ ఓన్లీ రీజన్ మావిగన్ అని అంటున్నారు. మావిగన్ అన్న మూడు అక్షరాల పదం వైసీపీని పొలిటికల్ గా ఏపీ రాజకీయ తెర మీద ఫుల్ ఫోకస్డ్ గా నిలిచేలా చేసింది అని అంటున్నారు.ఇక దీని మీద జరిగిన చర్చ ఇంతాఅంతా కాదు అది పాజిటివ్ గా జరిగిందా లేక నెగిటివ్ గా జరిగిందా అన్నది పక్కన పెడితే వైసీపీ అన్న పేరు ప్రతీ చోటా నానేలా చేసింది. ఆ విధంగా చూస్తే ఏప్రిల్ నెల మొదటి తేదీన వైసీపీ అధినేత జగన్ వైసీపీ కేంద్ర కార్యాలయంలో ప్రెస్ మీట్ పెట్టారు. ఆ రోజున ఆయన మావిగాన్ అని ప్రతిపాదించారు. అంతే నాటి నుంచి దాదాపుగా నెల రోజులుగా అదే సోషల్ మీడియాలో తెగ ట్రెండింగ్ అవుతోంది. ఎంతలా అంటే మరే టాపిక్ కూడా కనీసంగాచర్చకు నోచుకోనంతగా ఈ ఒక్క టాపిక్ తోనేవైసీపీ బహుళ ప్రచారం పొందింది.నిజంచెప్పాలంటే ఈ సమయంలో అంటేవైసీపీ భారీ ఓటమినిఅందుకుని విపక్షంలో ఉంటూ కేవలం 11 సీట్లతో చతికిలపడిన వేళ ఆ పార్టీ రాజకీయంగా ఇబ్బందులు పడుతున్న వేళవచ్చిన ఈ బూస్టింగ్ కానీజరిగిన ప్రచారంకానీ రూపాయలలో లెక్క కడితే కచ్చితంగా వంద కోట్ల పై మాటే అంటున్నారు. అంటే పార్టీ ఖజానా నుంచి వంద కోట్లు తీసి పబ్లిసిటీ చేయించుకుంటే వచ్చే పబ్లిసిటీ ఫ్రీగానే వచ్చేసింది అన్న మాట. ఈ ప్రచారం అంతా మీడియానే మోసింది. భారీగా చేసింది. అది మెయిన్ స్ట్రీమ్ మీడియానా లేక సోషల్ మీడియానా లేక డిజిటల్ ప్లాట్ ఫారం నా అన్నది పక్కన పెడితే ఒక్క మావిగన్ తో వైసీపీ అచ్చంగా ఉచిత ప్రచారాన్ని వందల కోట్ల దాకా పొందేసింది. ఇందులో జనాలదే తొంబై శాతం పాత్ర అయితే వైసీపీ నుంచి మావిగాన్ ని సమర్థించుకుంటూ చేసిన ప్రచారం కేవలం పది శాతం మాత్రమే. అంటే ఇంతలా ఇది ప్రచారం అవుతుందని బహుశా వైసీపీ కూడా ఊహించి ఉండదు ఏది ఏమైనా వైసీపీకి ఈ సమయంలో అయితే ఇది బాగా జనంలో ఫోకస్ అయ్యేలా చేసింది మరి ఇది పాజిటివ్ గానా నెగిటివ్ గానా అన్నది పక్కన పెడితే ఒక రాజకీయ పార్టీకి కావాల్సినంత ప్రచారం అయితే దక్కింది. ఆ విధంగా వైసీపీ లక్కీ అనే అంటున్నారు.

## తమిళనాట సంచలనం.. డీఎంకే, ఏడీఎంకేను చిత్తుచిత్తుగా ఓడించిన ఆటో డ్రైవర్



తమిళనాడు శాసనసభ ఎన్నికల చరిత్రలో కీలక పరిణామం చోటు చేసుకుంది. రాయపురం నియోజకవర్గంలో టీవీకే నుండి పోటీ చేసిన ఆటో డ్రైవర్ కె. విజయ్ ధాము అద్భుత విజయం సాధించాడు. తొలిసారిగా బరిలో దిగిన టీవీకే తరఫున పోటీ చేసిన విజయ్ రాష్ట్రంలోని అత్యంత శక్తివంతమైన పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకే అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించాడు. విజయ్ ధాము 55వేలకు పైగా ఓట్లు సాధించగా తన సమీప ప్రత్యర్థిపై 14వేల ఓట్ల మెజారిటీతో విజయాన్ని కైవసం చేసుకున్నాడు. మరోవైపు ఇక్కడ అన్నాడీఎంకే పార్టీ నుండి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జయకుమార్‌ను కూడా ఓడించడం ఆసక్తికరంగా మారింది. ఐదుసార్లు గెలిచిన జయకుమార్ కేవలం 18వేల ఓట్లను మాత్రమే సాధించి మూడో స్థానానికి పరిమితం అయ్యాడు. డీఎంకే నుండి దివంగత సీనియర్ మంత్రి రెహమాన్ ఖాన్ కుమారుడు సుబైర్ ఖాన్ పోటీ చేయగా రెండో స్థానంలో నిలిచాడు. ఇదిలా ఉంటే ఆటో డ్రైవర్ విజయ్ ధాము టీవీకే అధినేత విజయ్ అభిమానసంఘం అయిన విజయ్ మక్కల్ ఇయక్కంలో సభ్యుడుగా ఉన్నాడు. ఒక సామాన్యుడిగానే విజయ్ ధాము టీవీకే నుండి టికెట్ దక్కించుకున్నాడు. పార్టీ అభ్యర్థుల ప్రకటన కార్యక్రమంలో కన్నీళ్లతో పార్టీ అధినేత విజయ్ ని ఆలింగనం చేసుకోవడంతో ఆటో డ్రైవర్ వీడియో, ఫోటోలు నెట్టింట చక్కర్లు కొట్టాయి. ఇక ప్రచారంలో విజయ్ ధాము.. మీరు మమ్మల్ని కొత్త ముఖాలు అనుకోవచ్చు. కానీ అభిమాన సంఘాల ద్వారా మేము కొన్నేళ్ల నుండి క్షేత్రస్థాయిలో సేవ చేస్తున్నామని తెలిపి జనాలను తనవైపు తిప్పుకున్నాడు.

# బ్యాలెట్ బాక్సుల్లో భవితవ్యం




ప్రజాస్వామ్య భారత్‌లో ఎన్నికలు అంటే కేవలం ఓట్లు వేయడం మాత్రమే కాదు. ఆ ఓటు ఫలితం ఏంటో తెలుసుకోవాలని ఉత్సుకత ప్రతి ఒక్కరిలో ఉంటుంది. ఎన్నికల ఫలితాలు వెలువడటానికి ముందే ప్రజల నాడిని పట్టుకోవాలని ప్రయత్నించే చర్య సర్వేలు. ప్రస్తుతం 2026లో ఐదు రాష్ట్రాల్లో జరిగిన పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఇప్పుడు ఎగ్జిట్ పోల్స్ కూడా వచ్చాయి. అయితే ఈ సర్వేలు ఎలా చేస్తారు. వీటికి ఉండే చట్టబద్ధత ఏంటీ అనే విషయాలను లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఒపీనియర్ పోల్ లేదా అభిప్రాయ సేకరణ అనేది ఎన్నికలు ప్రారంభంకావడానికి ముందే నిర్వహించే సర్వే. నామినేషన్ల ప్రక్రియకు ముందు లేదా ప్రచారం జరుగుతున్న సమయంలో వీటిని చేపడతారు. ఓటర్లు ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు, వారి ప్రధాన సమస్యలు ఏంటీ, ప్రచార పద్ధతులు ఓటర్లను ఎంత వరకు ప్రభావితం చేస్తున్నాయి అనేది తెలుసుకోవడానికి సర్వేలు చేస్తారు. శాంపిల్ సైజ్ నుంచి సమాచారాన్ని సేకరిస్తారు. ఎన్నికల ప్రచారం సాగుతున్న కొద్దీ ప్రజల అభిప్రాయాలు మారే ఛాన్స్ ఉంది. అందుకే ఒపీనియన్ పోల్ ఫలితాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. ఎగ్జిట్ పోల్ అనేది ఓటు వేసిన తర్వాత బయటకు వచ్చిన ఓటరు అభిప్రాయాన్ని నేరుగా సేకరించే ప్రక్రియ. ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకున్న వెంటనే పోలింగ్ కేంద్రం వెలుపల ఈ సర్వే చేస్తారు. సర్వే చేసే వ్యక్తులు పోలింగ్ బూత్ బయట వేచి ఉండి, ఓటు వేసి వస్తున్న వారిని మీరు ఎవరికి ఓటు వేశారు అని అడిగి తెలుసుకుంటారు. ఓటరు తన నిర్ణయాన్ని అమలు చేసిన తర్వాత చెప్పే మాటలు కాబట్టి ఇవి ఒపీనియన్ పోల్స్ కంటే కాస్త కచ్చితత్వానికి దగ్గరగా ఉంటాయని భావిస్తున్నారు. అయితే ఇవి కేవలం ప్రాథమిక అంచనాలు మాత్రమే. అధికారిక ఫలితాలు కావు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా జరగడానికి కేంద్ర ఎన్నికల సంఘం కొన్ని రూల్స్ ఫ్రేమ్ చేసింది. ముఖ్యంగా ఎగ్జిట్ పోల్స్ ప్రసారంపై ఆంక్షలు విధించింది. ఎన్నికలు ఒకటి కంటే ఎక్కువ దశల్లో జరుగుతున్నప్పుడు అన్ని దశల పోలింగ్ పూర్తి అయ్యే వరకు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెల్లడించకూడదు. ఇవాళ కూడా దీన్ని అమలు చేసింది. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమై ఆరు గంటలకు ముగిసింది. ఎగ్జిట్ పోల్ ఫలితాలు ఆరున్న తర్వాత వెల్లడించారు. ఈ రూల్స్ అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ ఉంటాయి. మీడియా సంస్థలు, పరిశోధన ఏజెన్సీలు, పోలింగ్ సంస్థలు వివిధ పద్ధతుల ద్వారా డేటాను సేకరిస్తాయి. క్షేత్రస్థాయిలో ఓటర్లతో మాట్లాడటం ద్వారా, టెలీఫోన్ ద్వారా ఓటర్ల అభిప్రాయం తెలుసుకుంటాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో టీంలను పంపించి సమాచారాన్ని సేకరిస్తారు. మరో వైపు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు అన్ని సర్వేలు డీఎంకే కూటమిదే మళ్లీ అధికారమని అంచనా వేశాయి. కానీ, ఒక్క సంస్థ మాత్రం దళపతి విజయ్ పార్టీ టీవీకే మెజార్టీ స్థానాల్లో గెలిచి, అధికారం చేపడుతుందని తెలిపింది. యాక్సిస్ మై ఇండియా సర్వే విజయ్ పార్టీ సునామీ తథ్యమని జోస్యం చెప్పింది. ఆ సంస్థ అంచనా ప్రకారం టీవీకే 98 నుంచి 120 స్థానాలు, డీఎంకే కూటమి 92 నుంచి 110, అన్నాడీఎంకే కూటమి 22 నుంచి 30 సీట్లలో గెలుస్తుందని పేర్కొంది. మొత్తం 234 స్థానాలున్న తమిళనాడులో అధికారం చేపట్టడానికి మ్యాజిక్ ఫిగర్ 118 స్థానాలు. ఆ సర్వే అంచనా నిజమైతే విజయ్ ముఖ్యమంత్రి అవుతారు. అయితే, తుది ఫలితాలు అంచనాలకు దగ్గరగా ఉంటాయా? లేదా? అనేది మే 4న తేలిపోనుంది. అంతేకాదు, అంచనాలు తారుమారై డీఎంకే కూటమి మెజార్టీ మార్క్‌కు దగ్గరగా ఆగిపోతే విజయ్ మద్దతు కీలకమవుతుంది. రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, గతంలో పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల్లో యాక్సిస్ మై ఇండియా సర్వేలు నిజమయ్యాయి. గతంలో ఐదు సందర్భాల్లో మిగతా సంస్థలకు భిన్నంగా దీని అంచనాలు, ఫలితాలకు దగ్గరగా ఉన్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమికి 359 సీట్లు వస్తాయని అంచనా వేసింది. ఈ అంచనాలకు అనుగుణంగా ఫలితాలు వచ్చాయి. 2024లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, గతేడాది ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు, అంతకు ముందు మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికల సమయంలోనూ ఖచ్చితంగా అంచనా వేసింది. మధ్యప్రదేశ్‌లో అన్ని సర్వేలూ కాంగ్రెస్ గెలుస్తుందని చెబితే.. యాక్సిస్ మై ఇండియా మాత్రం 140- 162 సీట్లు వస్తాయని జోస్యం చెప్పింది. అన్నట్టుగానే బీజేపీ 163 సీట్లతో మళ్లీ అధికారం నిలబెట్టుకుంది. ఎగ్జిట్ పోల్స్ ఎప్పుడూ ఓట్ల లెక్కింపు రోజున వాస్తవ ఫలితాలుగా మారనప్పటికీ, అవి ప్రజా చర్చను ప్రభావితం చేస్తూ, తుది తీర్పుపై ఉత్కంఠను పెంచుతాయి. ఇక బెంగాల్ విషయానికి వస్తే పీపుల్స్ పల్స్ సర్వే టీఎంసీకి 177 నుంచి 187, బీజేపీకి 95-110 స్థానాలు వస్తాయని అంచనా వేసింది. మ్యాట్రిజ్ సర్వే టీఎంసీ 125 నుంచి 140, బీజేపీ 146-161 చోట్ల విజయం సాధిస్తుందని పేర్కొంది. అయితే, పీ-మార్క్ సర్వే మాత్రం టీఎంసీ 118-138, బీజేపీ 150-175 స్థానాల్లో గెలిచే అవకాశం ఉందని పేర్కొంది. చాణక్య స్ట్రాటజీస్ కూడా బీజేపీకి ఛాన్స్ ఉందని వెల్లడించింది. బీజేపీకి 150-160 స్థానాలు, తృణమూల్ కాంగ్రెస్‌కు 130-140 స్థానాలు వచ్చే ఛాన్స్ ఉందని తెలిపింది. పోల్ డెయిరీ కూడా కమలం వికసిస్తుందని అంచనా వేసింది. టీఎంసీకి 99 నుంచి 127, బీజేపీకి 142 నుంచి 171, కాంగ్రెస్ 3 నుంచి 5 స్థానాల్లో విజయం సాధిస్తాయని చెప్పింది. జన్మత్ 195 నుంచి 205 స్థానాలు టీఎంసీకి, 80 నుంచి 90 స్థానాలు బీజేపీకి వస్తాయని అంచనా వేసింది. అలాగే, ఎన్డీటీవీ అంచనాలు కూడా టీఎంసీ 146, బీజేపీ 140, ఇతరులు 6 చోట్ల విజయం సాధించే అవకాశం ఉన్నాయని తెలిపాయి. మరి ఈసారి కూడా ఈ సంస్థ అంచనాలు నిజమవుతాయా? అనేది మే 4న తెలుస్తుంది. తమిళనాడు ఎన్నికల్లో తొలిసారి పోటీచేసిన విజయ్.. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోలేదు. ఈ సర్వే అంచనా వేసినట్టు ఫలితాలు ఉంటే.. విజయ్ చరిత్రను తిరగరాయనున్నారు. ఇప్పుడు ఎగ్జిట్ పోల్స్ ఇస్తున్న సంస్థలు పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో ఓటింగ్ సరళిని అంచనా వేయడానికి ఈ పద్ధతులను అనుసరించాయి. ఎగ్జిట్ పోల్స్ అనేవి కేవలం సంకేతాలు మాత్రమే ఇవి ఎప్పుడూ కచ్చితంగా ఉంటాయని చెప్పలేం. అనేక సందర్భాల్లో ఎగ్జిట్‌పోల్ అంచనాలు లెక్క తప్పుతుంటాయి. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల్లో ఒకట్రెండు మినహా మిగతా సర్వే సంస్థల లెక్కలు తెప్పాయి.

# బెజవాడ వైసీపీకి నేతలు కావలెను..



విజయవాడ : ఉమ్మడి కృష్ణా జిల్లాలో వైసీపీ? నియోజకవర్గ సమన్వయకర్తల పనితీరు ఇప్పుడు పార్టీలోనే చర్చగా మారింది. మొత్తం 16 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా? 2024 ఎన్నికల్లో ఒక్క చోట కూడా పార్టీ బోణీ కొట్టలేదు. కూటమి పార్టీలు వంద శాతం సీట్లు గెల్చుకోగా?జిల్లాలో వైసీపీ జీరో అయింది. అయితే? అంత ఘోరమైన ఓటమి నుంచి కూడా త్వరగా కోలుకున్న పార్టీ అధిష్టానం రెండేళ్ళుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా.. పెద్ద ఎత్తున పోరాట కార్యక్రమాలకు పిలుపునిస్తోంది. కానీ? ఉమ్మడి కృష్ణాలోని నియోజకవర్గాల ఇన్చార్జ్‌లు చాలామంది అధిష్టానం పిలుపునిచ్చిన స్థాయికి తగ్గట్టుగా స్పందించడం లేదన్నది పార్టీలో అంతర్గతంగా జరుగుతున్న చర్చ. ఈ వ్యవహారం పెద్దల దృష్టికి కూడా వెళ్ళిందట. దీంతో వివిధ నియోజకవర్గాల ఇన్చార్జ్‌లు, స్థానిక నేతల పనితీరుకు సంబంధించిన ఫీడ్ బ్యాక్ రిపోర్ట్స్ తెప్పించుకుంటున్నట్టు తెలుస్తోంది. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల అక్రమాలకు సంబంధించి స్థానిక పార్టీ నేతలు అనుకున్న స్థాయిలో రెస్పాండ్ అవ్వటం లేదన్నది ఫ్యాన్ అధిష్టానం అభిప్రాయం. కేవలం కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే ఇన్చార్జ్‌లు అనుకున్న స్థాయిలో స్పందిస్తున్నారని, ఎక్కువ చోట్ల సైలెంట్ మోడ్‌లో ఉండటంపై ఆరా తీస్తున్నారట. ప్రధానంగా మచిలీపట్నం రాజకీయాలు గతంలో లేనంత హాట్ హాట్ గా మారిపోయాయి. ఇక్కడ నిత్యం మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి పేర్ని నాని వర్గాల మధ్య నువ్వా నేనా అన్నట్టు ఉంటోంది. మంత్రికి వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు పేర్ని. నియోజకవర్గంలో ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలకు ఇబ్బంది కలిగితే వాటిపై కూడా క్షేత్రస్థాయికి వెళ్ళి ఆందోళనకు దిగుతున్నారు. పామర్రులో ఇసుక, మట్టి దోపిడీ, పేకాట, చెరువు తవ్వకాల మీద మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ ఆందోళన చేయటంతో పాటు సోషల్ మీడియాలో కూడా ఎమ్మెల్యే తీరుపై విమర్శలు చేస్తున్నారు. పెనమలూరులో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వ్యవహారాలపై ఇన్చార్జ్ దేవభక్తుని చక్రవర్తి నిత్యం ఆందోళనకు చేయటం ద్వారా ఎమ్మెల్యే కంట్లో నలుసుగా మారారనేది లోకల్ టాక్. అటు నందిగామలో మొండితోక బ్రదర్స్ వర్సెస్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్న విధంగా వ్యవహారం మారింది. ఈ పోరులో మొండి తోక బ్రదర్స్ పై స్థానికంగా పలు కేసులు కూడా నమోదయ్యాయి. అటు వల్లభనేని వంశీ కూడా ఎన్ని కేసులు పెడుతున్నా గన్నవరంలో ఇళ్ళ పట్టాల సమస్యకు సంబంధించి నేరుగా జిల్లా కలెక్టర్ కలిసి మరి ఫిర్యాదులు చేస్తున్నారు. మైలవరంలో ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్, ఆయన బావమరిది పోసాని కోటేశ్వర రావు నియోజక వర్గాన్ని దోచుకుంటున్నారంటూ ఆరోపిస్తున్నారు జోగి రమేష్. బూడిద, మైనింగ్,మట్టి అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ధ్వజమెత్తుతున్నారాయన. వీళ్ళు తప్ప మిగతా ఎవరూ? పార్టీ ఆశించిన స్థాయిలో పని చేయడం లేదని వైసీపీ అధిష్టానం గుర్తించినట్టు తెలిసింది. ప్రధానంగా విజయవాడ నగరాన్ని పరిశీలిస్తే? ఇక్కడ నుంచి గతంలో వెలంపల్లి శ్రీనివాస్ మంత్రిగా పని చేశారు. కానీ? అధికారం కోల్పోయిన దగ్గర నుంచి ఆయన పార్టీ ఆదేశించిన కార్యక్రమాలకు మాత్రమే పరిమితం అవుతున్నారు తప్ప? నియోజకవర్గంలో పెద్దగా ప్రత్యక్ష ఆందోళనలు నిర్వహించడం లేదని నాయకులే మాట్లాడుకుంటున్నారు. విజయవాడ సెంట్రల్ నుంచి ఇన్చార్జ్‌గా ఉన్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కూడా పెద్దగా నోరు విప్పని పరిస్థితి ఉందనేది లోకల్ టాక్. మల్లాది విష్ణు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బోండా ఉమా సైతం ఆయన మీద పెద్దగా విమర్శలు చేయలేదన్న సంగతి గుర్తు చేసుకుంటున్నారు స్థానికులు. ఎన్నికల సమయంలో గద్దె రామ్మోహన్ పై అనేక విమర్శలు చేసిన తూర్పు నియోజకవర్గ ఇన్చార్జ్ దేవినేని అవినాష్ ఇప్పుడు జిల్లా అధ్యక్షుడు కావడంతో నియోజకవర్గం కంటే జిల్లా వ్యవహారాలపై ఫోకస్ పెడుతున్నారట. ఇక జగ్గయ్యపేటలో కొత్తగా ఇన్చార్జ్ పదవి పొందిన నాగేశ్వరరావు, తిరువూరు ఇన్చార్జ్ స్వామిదాస్ పనితీరు ఆశించిన స్థాయిలో లేదన్నది అధిష్టానం అభిప్రాయం. వీళ్ళందరి పనితీరుకు సంబంధించి స్థానికంగా ఉన్న నియోజకవర్గాల అబ్జర్వర్ల నుంచి నివేదికలు సేకరించిన అధిష్టానం?. సైలెంట్‌గా ఉన్న వాళ్ళని యాక్టివేట్ చేసేందుకు చర్యలు తీసుకోబోతున్నట్టు తెలుస్తోంది.

## ప్రజావాణి దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి కలెక్టర్ కె. హరిత



ఆసిఫాబాద్ (తెలంగాణ వాణి) ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు యువరాజ్ మార్మట్, డేవిడ్‌తో కలిసి ప్రజావాణి నిర్వహించారు. గత దరఖాస్తుల పెండింగ్‌ను నిర్ణీత గడువులో పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, పొరుగు సేవల సిబ్బంది మే 10లోగా ఇళ్ల గణనలో స్వీయ గణన చేసుకోవాలని సూచించారు. రహదారి ఆక్రమణ, భూకబ్జా, ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ సమస్యలపై పలు దరఖాస్తులు స్వీకరించారు.

## బెంగాల్‌లో బీజేపీ విజయంపై పవన్ షాకింగ్ కామెంట్స్



హైదరాబాద్: పశ్చిమబెంగాల్ ఫలితాలపై జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. ఎక్స్ వేదికగా స్పందించిన పవన్.. మార్పు, అభివృద్ధి కోసం ప్రజలు ఈ తీర్పు ఇచ్చారన్నారు. నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో జరిగిన ఎన్నికల ఫలితాలు, అభివృద్ధి పట్ల, పరిపాలనలో నిర్ణయాత్మక మార్పు పట్ల ప్రజల ప్రాధాన్యతను స్పష్టంగా చూపించేలా ఉన్నాయన్నారు. అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాలు అభివృద్ధి చేసే నాయకత్వానికి తమ మద్దతు తెలపగా, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ ప్రజలు రాజకీయమార్పును కోరుకున్నారన్నారు. మోడీ నాయకత్వంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ వ్యూహాత్మక నిర్దేశంతో అమిత్ షా రాజకీయ చతురతతో బీజేపీ పశ్చిమ బెంగాల్ లో చారిత్రాత్మక విజయాన్ని సాధించిందని పేర్కొన్నారు. ఈ విజయానికి గాను బీజేపీ నాయకత్వానికి అభినందనలు తెలిపారు. భారత స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన, అక్రమ చొరబాట్లు.. శాంతి భద్రతల సమస్యలు లాంటి సవాళ్లను ఎదుర్కొన్న బెంగాల్ గడ్డపై ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుండటం స్థిరత్వానికి, పురోగతికి ఆశ కల్పిస్తూ భరోసాను ఇస్తోందన్నారు. అస్సాంను బీజేపీ వరుసగా మూడోసారి కైవసం చేసుకున్నందుకు, ప్రజల విశ్వాసాన్ని నిరంతర విశ్వాసాన్ని ప్రతిబింబిస్తూ రెండోసారి సీఎం అవ్వబోతున్నందుకు హిమంత భిశ్వశర్మకు అభినందనలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. కేరళలోని యూడీఎఫ్ నాయకత్వానికి మరియు పుదుచ్చేరిలోని ఎన్డీఏ మిత్రపక్షాలకు వారి విజయాలకు కూడా అభినందనలు తెలిపారు. మొదటి ఎన్నికల్లోనే తమిళనాట ఘన విజయం సాధించినందుకు టీవీకే పార్టీకి, విజయ్ కి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# నెలకు 3 వేల ఇళ్లే అమ్మకం

## పడకేసిన అమ్మకాలు



హైదరాబాద్, : హైదరాబాద్ లో ఇళ్ల అమ్మకాలు గణనీయంగా పడిపోయాయి. నైట్ ఫ్రాంక్ ఇండియా ఈ మేరకు నివేదికలో తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే ఈ మూడు నెలల కాలంలో ఇళ్ల ధరల్లో తొమ్మిది శాతం పెరుగుదల ఉంది. ఈ మూడు నెలల్లో కేవలం 9,975 ఇళ్లను మాత్రమే విక్రయించారని నివేదికలు స్పష్టం చేశాయి. పశ్చిమాసియాలో యుద్ధం ప్రభావంతో పాటు సాఫ్ట్ వేర్ రంగంలో నెలకొన్న ఒడిదుడుకులు ఇళ్ల కొనుగోళ్లు తగ్గడానికి కారణమని ప్రధానమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గతంలో ఎక్కువగా సాఫ్ట్ వేర్ రంగం బలంగా ఉన్నప్పుడు అధికంగా ఇళ్ల విక్రయాలు జరిగేవి. కానీ ఇటీవల ఏఐ ఎఫెక్ట్ తో అనేక కంపెనీలు ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఉద్యోగంలో భద్రత లేని కారణంగా సాఫ్ట్ వేర్ ఇంజినీర్లు అత్యధిక ధరను పెట్టి ఇళ్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. బ్యాంకు లోన్ తీసుకుని ఇంటిని కొనుగోలు చేసినప్పటికీ ఒకవేళ ఉద్యోగం ప్రమాదంలో పడితే అప్పుల భారం ముప్పుగా మారుతుందని అంచనాతో ఇళ్ల కొనుగోలుకు అనాసక్తిని చూపుతున్నారు. హైదరాబాద్ లో అనేక చోట్ల యాభై లక్షల నుంచి అరవై లక్షల రూపాయలకే డబుల్ బెడ్ రూం ఫ్లాట్లు ఇస్తామంటూ పెద్దయెత్తున బిల్డర్లు సోషల్ మీడియా ద్వారానూ, వివిధ సామాజికమాధ్యమాల ద్వారా ప్రచారం చేసుకుంటున్నారు. అనేక రాయితీలు కూడా కల్పిస్తున్నారు. జీఎస్టీ మినహాయింపు కూడా ఉంటుందని, మాడ్యులర్ కిచెన్, వుడ్ వర్క్ ఫ్రీగా చేస్తామని ఆఫర్లు ఇస్తున్నారంటే హైదరాబాద్ లో ఇళ్ల అమ్మకాలు పడిపోయాయని తెలుస్తోంది. మరొకవైపు హైడ్రా దూకుడుతో అన్ని రకాలుగా బఫర్ జోన్ లో ఆ ప్రాంతం ఉందా? లేదా? అని తెలుసుకోవడం కూడా కష్టంగా మారి కొనుగోలుకు ఎవరూ ఇష్టపడటం లేదన్నది మరొక వాదన. మొత్తం మీద హైదరాబాద్ లో ఇళ్ల ధరలు తక్కువకే ఇస్తామన్నా కొనుగోలు చేసే వారు మాత్రం లేరు.




## తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో..భారీగా ట్రాఫిక్ జామ్



తిరుమలయపాలెం మే, 4 : ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో రైతులు రోడ్డెక్కారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోని వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని, మొక్కజొన్నలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పిండిప్రోలులో ఖమ్మం -వరంగల్ జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. గంటన్నరసేపు రాస్తారోకో నిర్వహించారు. దీంతో భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు, అధికారులు వెళ్లి రైతు నాయకులతో చర్చలు జరిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఫోన్‌లో రైతులతో మాట్లాడారు. రైతుల పంటలను కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు బిల్లగిరి ధనుంజయ,చామకూరి రాజకుమార్, జక్కుల వీరన్న, గుంటి పుల్లయ్య, చిర్ర కృష్ణయ్య, వార్డు సభ్యులు రెడ్డి మల్ల నరేందర్, పులిగుజ్జు ఉపేంద్రమ్మ పాల్గొన్నారు.

# నష్టాల్లో సింగరేణి సంస్థ

**ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ సంఘాల వైఫల్యమే**
**గుర్తింపు సంఘం పిరియడ్ అయ్యాక పోరాటాలు చేస్తారా!?**
**రాజకీయ జోక్యంతోనే ఆర్థికంగా బలహీనపడిన సింగరేణి**
**జూన్ 7 న భూపాల్ పల్లి ఏరియాలో జరిగే**
**మహాసభలను కార్మికులు విజయవంతం చేయాలి**
**ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి మాధవ నాయక్ పిలుపు**



కొత్తగూడెం సింగరేణి (తెలంగాణ వాణి): ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిలో గుర్తింపు, ప్రాంతీయ గుర్తింపు సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్టియుసి కార్మిక సంఘాల వైఫల్యమే సింగరేణి కష్టాలకు కారణమని బిఎంఎస్ అనుబంధ ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి పి. మాధవ నాయక్, పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మండ రమాకాంత్, అప్పాని శ్రీనివాస్ లు పేర్కొన్నారు. ఆదివారం భూపాలపల్లి ఏరియా సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ భూపాలపల్లి ఏరియాలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థలు రు. 50,000 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 12వ వేతన ఒప్పందం అమలుకు దశలవారీ ఆందోళనలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సింగరేణి గత బీఆర్ ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయిందని మాధవ నాయక్ ఆరోపించారు. ప్రభుత్వాల అధిక రాజకీయ జోక్యం కారణంగానే సంస్థ ఆర్థికంగాబలహీనపడుతోందని విమర్శించారు. డిసెంబర్ 2025 నాటికి సింగరేణికి రావలసిన సుమారు 50,000 కోట్ల బకాయిలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కో నుండి వసూలు చేయడంలో గుర్తింపు సంఘాలు అయిన ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. దీంతో సంస్థ ఆర్థిక ఇబ్బందులు మరింత తీవ్రమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ, సకాలంలో స్ట్రక్చర్ మీటింగ్‌లు నిర్వహించి యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావడంలోను, కార్మిక సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని పేర్కొన్నారు. అంతేకాక కార్పొరేట్ మెడికల్ బోర్డును సమర్థవంతంగా నిర్వహించడంలో కూడా వైఫల్యం చెందిందని విమర్శించారు. కార్మికులకు ఇచ్చిన హామీలు-సొంతింటి పథకం, పెర్క్‌పై ఇన్‌కమ్ టాక్స్ రీయింబర్స్‌మెంట్, పదోన్నతి క్యాడర్ స్కీమ్‌లు,అమలు కాకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తింపు సంఘ హోదా ముగిసిన తర్వాత పోరాటం చేస్తున్నామని భ్రమలు కల్పించి కార్మికులను మరోసారి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా కొత్త గనుల కేటాయింపులో రాజకీయ కారణాలతో సింగరేణికి అన్యాయం జరిగిందని ఆరోపించారు. గతంలో గనులు రాకుండా అడ్డుకున్న సంఘాలే ఇప్పుడు వేలం ద్వారా గనులు పొందాలని చెప్పడం అవగాహన లోపమని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితులకు సంబంధిత సంఘాలే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) రాజకీయాలకు అతీతంగా సింగరేణి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తోందని స్పష్టం చేశారు. బొగ్గు బ్లాకుల వేలం ద్వారా కొత్త గనులు సాధించి సంస్థ మనుగడ కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్న బీఎంఎస్‌ను ప్రత్యామ్నాయ సంఘంగా కార్మికులు ఆదరించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 11వ వేతన సవరణ కాలపరిమితి ఈ ఏడాది జూన్ 30తో ముగియనున్న నేపథ్యంలో, జూలై 1 నుండి అమలులోకి వచ్చే 12వ వేతన సవరణ కోసం జేబీసీసీఐ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా అన్ని బొగ్గు గనుల వద్ద గేట్ మీటింగ్‌లు నిర్వహించాలని బీఎంఎస్ నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ మంత్రి కిషన్ రెడ్డికి జేబీసీసీఐ కమిటీ ఏర్పాటు చేయాలని కోరుతూ ఏబీకేఎంఎస్ తరఫున లేఖ పంపినట్లు తెలిపారు. 12వ వేతన ఒప్పందానికి సంబంధించిన ఆందోళనల్లో కార్మికులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏబీకేఎంఎస్ కార్యవర్గ సభ్యులు, సింగరేణి బీఎంఎస్ భూపాలపల్లి ఏరియా ఉపాధ్యక్షులు వెలబోయిన సుజేందర్ సత్యారి శ్రీనివాస్, శ్రీరాములు,ఓ.లక్ష్మణ్, భాస్కర్, పని రమేష్, కటకం శ్రీనివాస్, మల్లేష్,రాజు, నాయక్, దేవర సమ్మయ్య, పునీత్ రావు, ప్రవీణ్,అడప రాజు ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
**పటాన్ చెరు లో కన్యకా పరమేశ్వరి దేవాలయం నిర్మాణ పనులకు శంకుస్థాపన**



పటాన్ చెరు, మే 4, (తెలంగాణ వాణి రిపోర్టర్): ప్రజలలో భక్తి భావం పెంపొందించడంలో భాగంగా నియోజకవర్గం వ్యాప్తంగా నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని పంచముఖి హనుమాన్ దేవాలయం ఎదురుగా నూతనంగా నిర్మించ తలపెట్టిన కన్యకా పరమేశ్వరి దేవాలయం నిర్మాణ పనులకు ఆదివారం ఉదయం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు. పటాన్చెరు నియోజకవర్గ వ్యాప్తంగా సొంత నిధులతో 220 కి పైగా దేవాలయాలు నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లోనూ మరిన్ని దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు, పాల్గొన్నారు.

## ఇండ్ల స్థలాల కోసం పాత్రికేయులు సొసైటీ ఏర్పాటు చేసుకోవాలి

**-అదనపు కలెక్టర్ మహేందర్ జి.**
**-అర్హులైన విలేకరులకు అక్రిడేషన్లు, ఇండ్లు నిర్మించి ఇవ్వాలి జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ**



ములుగు (తెలంగాణ వాణి): ములుగు జిల్లాలోని పాత్రికేయులు ఇండ్ల స్థలాలను పొందడానికి జిల్లాలో హౌసింగ్ సొసైటీ ఏర్పాటు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహేందర్ జి. అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశపు హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ పాత్రికేయులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ జి మాట్లాడుతూ జిల్లాలో హౌసింగ్ సొసైటీ లేని కారణంగానే ఇండ్ల స్థలాలను కేటాయించడం జరుగలేదని, స్థల పరిశీలన చేసి అర్హులకు ఇండ్ల స్థలాలు కేటాయించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జె.జాక్ కన్వీనర్ గుర్రపు శ్రీధర్ మాట్లాడుతూ అర్హులైన విలేకరులకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. జిల్లా కేంద్రంలో 2024 సంవత్సరంలో ప్రెస్ క్లబ్ నిర్మాణానికి మంత్రి సీతక్క శంకుస్థాపన చేయగా నేటి వరకు భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని, ఇప్పటికైనా భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు జినుకల ప్రభాకర్, కో- కన్వీనర్లు పోలోజు రామ్మూర్తి, ఎనగందుల కొమురయ్య, మాట్ల సంపత్, సంగ రంజిత్, చల్లగురుగుల రాజు, లకుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి' దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్:ఏప్రిల్ 04 (తెలంగాణ వాణి) ప్రజా వాణిలో వచ్చిన దరఖాస్తు లకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీ లించి పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు.సోమవారం కలెక్టరేట్ ఆడి టోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖా స్తులు స్వీకరించారు. మొత్తం 99 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు.కొన్ని దరఖా స్తులను అక్కడికక్కడే పరి ష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని,పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయా లని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ డివిజన్లో పరిధిలో ఆర్డీవోల ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. కరీంనగర్ రెవెన్యూ డివిజన్ కు 75 దరఖాస్తులు,హుజురా బాద్ రెవిన్యూ డివిజన్ కు 14 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్,రెవిన్యూ డివిజన్లలో వచ్చిన మొత్తం దరఖాస్తులు 188.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే,ఆర్డీవో మహేశ్వర్,జెడ్పి సీఈవో శ్రీనివాస్,ఏవో సుధాకర్ ఇతర జిల్లా అధికారులు పాల్గొ న్నారు.

## సీనియర్ సిటిజన్స్ యాక్ట్ ను పకడ్బందీగా అమలు చేయాలి

**కొడారి వెంకటేష్**



భువనగిరి (తెలంగాణ విలేఖరి): యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి రెవెన్యూ అధికారి కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. మొట్టమొదటి దరఖాస్తు సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్ అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో సీనియర్ సిటిజన్స్ యాక్ట్ -2007 ను పకడ్బందీగా అమలు చేయాలని, ఆర్డీవో తీర్పును, ఆదేశాలను అమలు చేయని వారిపైపోలీసులు కేసులు నమోదుచేయాలని ఆయన కోరారు. సీనియర్ సిటిజన్స్ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగలేక, కన్న కొడుకుల కోడళ్ళ ఆదరణకు నోచుకోక ఇబ్బందులకు గురి అవుతున్నారనిఆయన అన్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి సీనియర్ సిటిజన్స్ యాక్ట్ పై సమీక్షా సమావేశం నిర్వహించి కేసులు పెండింగ్ లో లేకుండా చూడాలని ఆయన ఆర్డీవో కృష్ణారెడ్డి ని కోరారు. భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి తక్షణమే స్పందించితప్పని సరిగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని, ఆర్డీవో ఆదేశాలు అమలు చేయని వారిపై మండల తహసీల్దార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)లకు పిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఆర్డీవో కార్యాలయం లో జరిగిన ప్రజావాణి లో మొట్టమొదటి దరఖాస్తును అందజేసిన సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్‌ను ఆర్డీవో కృష్ణారెడ్డి అభినందించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో భువనగిరి డీఏఓ రాధా భువనగిరి తహసీల్దార్ జగన్ బీబీనగర్ తహసిల్దార్ శ్యాం సుందర్ రెడ్డి, డిప్యూటీ డీ ఎం హెచ్ ఓ డాక్టర్ సుమన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా బీరప్ప విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం



నిర్మల్-బిద్రెల్లి:మే04(తెలంగాణ వాణి ప్రతినిధి): నిర్మల్ జిల్లా బాసర మండలం బిద్రెల్లి గ్రామంలో శ్రీ బీరప్ప దేవుని ఆలయ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి.విట్టల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని ఉత్సవం కన్నుల పండుగగా సాగింది.ఈ కార్యక్రమంలో బాసర సర్పంచ్ వెంకటేష్ గౌడ్,కీర్గుల్ బి మాజీ సర్పంచ్ సుధాకర్ రెడ్డి,బిద్రెల్లి మాజీ సర్పంచ్ దిగంబర్, బాసర మాజీ సర్పంచ్ లక్ష్మణ్ రావు, ఏఎంసీ డైరెక్టర్ సుధాకర్ ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలి

**-ములుగు డివిజనల్ స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ**
**-జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్.జి**



ములుగు,మే4(తెలంగాణ వాణి):ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని ప్రజావాణిలో ఫిర్యాదుదారులు అందించిన అర్జీలను సత్వరమే వేగంగా పరిష్కరించాలని,రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డివిజనల్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ములుగు జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి. హెచ్. మహేందర్.జి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సి. హెచ్.మహేందర్. జి,డివిజనల్ స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డిఓ వెంకటేష్ ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 55 దరఖాస్తులు రాగా వాటిలో ఇందిరమ్మ ఇండ్లకు 12,పెన్షన్ లకు10,ఇతర శాఖలకు సంబంధించినవి 10,డివిజనల్ స్థాయి లో భూ సమస్యలకు సంబంధించి 23దరఖాస్తులు అందాయి.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యల అర్జీలను నేరుగా అదనపు కలెక్టర్ స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును వ్యక్తిగతంగా పరిశీలించి సంబంధిత శాఖలకు వెంటనే ఎండార్స్మెంట్ చేయడం జరిగిందని తెలిపారు. డివిజన్ స్థాయిలో అందిన భూ సమస్యల దరఖాస్తులను వెంటనే సంబంధిత మండల తాహశీల్దార్ లకు ఆన్లైన్ లో ఫార్వర్డ్ చేయడం జరిగిందని స్పష్టం చేశారు.ప్రజలకు సమయపాలనతో సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, దరఖాస్తుదారునికి వెంటనే కంప్యూటర్ ఆధారిత రశీదు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలపై దరఖాస్తులు అందించినవారు తమ సమస్య స్థితిగతులను కంప్యూటర్ రసీదు ద్వారా పరిశీలించుకోవచ్చు అని సూచించారు.ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని ప్రాధాన్యంగా తీసుకుని,నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.

## పశ్చిమ బెంగాల్ ప్రజలు మార్పు కోరుకున్నారు

**సంబరాల్లో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ**



నిజామాబాద్ (తెలంగాణ వాణి ప్రతినిధి): పశ్చిమ బెంగాల్ ప్రజలు మార్పు కోరుకున్నారని, మమతా బెనర్జీ అరాచక పాలన నుంచి విముక్తి పొందేందుకు బీజేపీ ని గెలిపించారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. దేశంలోని మూడు రాష్ట్రాల్లో బీజేపీ గెలిచిన నేపథ్యంలో సోమవారం నగరంలోని నిఖిల్ సాయి చౌరస్తా వద్ద సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బెంగాల్ లో బీజేపీ చరిత్ర సృష్టించిందన్నారు. ఊహించిన దానికంటే భారీ సీట్లు కైవసం చేసుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికల ద్వారా ప్రజలు అభివృద్ధిని, పారదర్శకతను, భద్రతను కోరుకుంటున్నారని మరోసారి నిరూపించారన్నారు. ప్రధానంగా బెంగాల్ ప్రజలు భయం, అవినీతి, అశాంతిపై తిరుగుబాటు చేశారని స్పష్టం చేశారు. మోడీ సారధ్యంలో ప్రజల విశ్వాసాన్ని బెంగాల్ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని తెలిపారు. ఈ తీర్పుతో దేశ రాజకీయాలకు కొత్త దిశను చూపుతోందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలోనూ మార్పు ఖాయమని స్పష్టం చేశారు. ప్రస్తుత ఫలితాలు చూస్తే ఇది కేవలం ఓటింగ్ కాదని..ప్రజల ఆలోచన విధానం మారుతుందనే సంకేతమన్నారు. ఇక కాంగ్రెస్ మూడు రాష్ట్రాల్లోనూ ఉనికి కోల్పోయిందని తెలిపారు. అస్సాంలో మరోసారి బీజేపీ కి ప్రజలు పట్టం కట్టారన్నారు. అభివృద్ధి దిశగా ప్రభుత్వాన్ని నడిపిస్తుండటంతో మళ్లీ ఆశీర్వదించారన్నారు. పుదుచ్చేరిలోనూ బిజెపి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారన్నారు. అనంతరం టపాసులు పేలుస్తూ.. మిఠాయిలు పంచుతూ సంబరాలు జరిపారు కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, ఫ్లోర్ లీడర్ ప్రమోద్, బిజెపి కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ లో బిజెపి శ్రేణులు సంబరాలు



చౌటుప్పల్, మే 4 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి): భారతీయ జనతా పార్టీ చౌటుప్పల మున్సిపల్ మరియు రూరల్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పశ్చిమబెంగాల్,అసోం, పుదుచ్చేరి రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ జెండా రెపరెపలాడినందుకు గాను చౌటుప్పల్ మున్సిపల్ బస్టాండ్ ఆవరణలో బాణా సంచా కాల్చి మిఠాయిలు పంచి బిజెపి శ్రేణులు సంబరాలు చేసుకోవడం జరిగింది. పశ్చిమబెంగాల్లో బిజెపి అధికారంలోకి రావడం దేశానికి ఎంతో అవసరం అదేవిధంగా 2028 ఎలక్షన్లలో తెలంగాణలో బిజెపి జెండా ఎగురవేసే విధంగా ప్రతి ఒక్క కార్యకర్త కంకణ బద్ధులై పని చేయాలని బిజెపి శ్రేణులు కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా బిజెపి అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు కడారి కల్పన యాదవ్, రూరల్ అధ్యక్షులు కైరం కొండ అశోక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడల భిక్షం గౌడ్, రమణగోని శంకరయ్య,గుజ్జుల సురేందర్ రెడ్డి, ముత్యాల భూపాల్ రెడ్డి, చినుకుని మల్లేశం, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, పాలకూరల జంగయ్య,రెడ్డి బాయ్ సర్పంచ్ నందగిరి వెంకటేశం, కాట్రేవ్ సర్పంచ్ బోయ మహేంద్ర మనీ, కౌన్సిలర్లు పోలపల్లి లక్ష్మీ,బుడ్డ సురేష్, ఉడుగు వెంకటేశం,బత్తుల జంగయ్య గౌడ్,ఉడుగు యాదయ్య గౌడ్, దాసోజు బిక్షమాచారి, గోషిక నీరజ ,దిండు భాస్కర్, రాధారపు సత్తయ్య,కడారి ఐలయ్య, పబ్బతి శేఖర్, అమృతం దశరథ,కాసుల వెంకటేశం గౌడ్,వరగంటి భాను ప్రకాష్,కానుగు కొండల్, కాసోజు గోపి, బాలరత్నం బూత్ అధ్యక్షులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సినిమా

## ఆగమనానికి సిద్ధమవుతూ..



ప్రముఖ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో కె.అచ్చిరెడ్డి సమర్పణలో.. కొమ్మూరి ప్రతాపరెడ్డి నిర్మిస్తున్న సందేశాత్మక యాక్షన్ చిత్రం 'వేదవ్యాస్'. పిడుగు విశ్వనాథ్ హీరోగా పరిచయం అవుతున్న ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలో సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమాను నిర్మిస్తున్న 'సాయి ప్రగతి ఫిల్మ్స్' బ్యానర్ విజువల్ లోగో ఆవిష్కరణ హైదరాబాద్ ఘట్‌కేసర్‌లోని కేపీఆర్ఐటీ విద్యా సంస్థల వార్షికోత్సవ వేడుకలో ఘనంగా జరిగింది. షిర్డీ సాయిబాబా విగ్రహానికి దర్శకనిర్మాతలు, సమర్పకుడు కలిసి పూజ చేస్తున్న దృశ్యాన్ని లోగోలో చిత్రీకరించారు. నిర్మాత కొమ్మూరి ప్రతాపరెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి, కె.అచ్చిరెడ్డి, హీరో పిడుగు విశ్వనాథ్, నటుడు రఘుబాబు, తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి శ్రీరామ్ వెంకటేశ్, కేపీఆర్ఐటీ విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, కార్యదర్శి రాకేశ్‌రెడ్డి ఇంకా అనేకమంది అతిథులతోపాటు నాలుగు వేలకు పైగా విద్యార్థినీ, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బాక్సులు బద్దలయ్యే ఇంట్రడక్షన్?



దర్శకుడు కేఎస్ రవీంద్ర(బాబీ) మెగా ఎంట్రీకి రంగం సిద్ధం చేస్తున్నారు. ఆయన దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా ఓ చిత్రం తెరకెక్కనున్న విషయం తెలిసిందే. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ, లోహిత్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే ప్రీప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. త్వరలోనే దర్శకుడు బాబీ షూట్‌ని మొదలుపెట్టనున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు మెగాస్టార్ ఇంట్రడక్షన్ సీన్‌ని తీసేందుకు ఆయన రంగం సిద్ధం చేస్తున్నారట. ఈ ఎంట్రీ సీక్వెన్స్ కోసం ప్రస్తుతం భారీ సెట్స్‌ని నిర్మిస్తున్నారు. ఈ సీక్వెన్స్‌లో మెగాస్టార్‌ని కొత్తగా చూపించేందుకు బాబీ ప్రణాళికలు రచిస్తున్నారు. చిరంజీవితోపాటు మొత్తం నలభై మంది ఫైటర్స్ కూడా ఈ సీక్వెన్స్‌లో కనిపిస్తారట. కుటుంబ భావోద్వేగాలే ప్రధానంగా సాగే ఈ కథలో చిరంజీవి పాత్ర చిత్రణ అభిమానులు పండుగ చేసుకునేలా ఉంటుందని సమాచారం. గతంలో చిరు, బాబీ కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. ఈ సినిమా అంతకు మించి ఉంటుందని డైరెక్టర్ టీమ్ చెబుతున్నది. సంక్రాంతికి సినిమాను విడుదల చేయాలనే ఉద్దేశంతో నిర్మాతలు ఉన్నారు.

## ఎన్నికల రిజల్ట్ రోజునే తిరుమలలో దర్శనమిచ్చిన త్రిష..





సీనియర్ హీరోయిన్ త్రిష కృష్ణన్ సోమవారం ఉదయం తిరుమలలో శ్రీవారి సేవలో పాల్గొని శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంది. సాధారణంగా సెలబ్రిటీలు తిరుమలకు వెళ్లడం కొత్తేమీ కాదు. అయితే ఈసారి త్రిష పర్యటన ప్రత్యేకంగా మారడానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి ఆమె పుట్టినరోజు కావడం, మరొకటి తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఇదే రోజున వెలువడటం. తిరుమలలో త్రిష దర్శనానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతున్నాయి. పుట్టినరోజు సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చినట్లు కొందరు భావిస్తుండగా, మరికొందరు దీని వెనుక రాజకీయ కోణం కూడా ఉందని అంటున్నారు.ఇటీవల తమిళనాడు రాజకీయాల్లోకి అడుగుపెట్టిన స్టార్ హీరో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ ఈ ఎన్నికల్లో పోటీ చేసింది. ఇప్పటికే ఎగ్జిట్ పోల్స్‌లో ఈ పార్టీకి అనుకూల ఫలితాలు రావచ్చన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో విజయ్ పార్టీ విజయాన్ని కోరుకుంటూ త్రిష తిరుమలకు వచ్చిందనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. ఇక గత కొంతకాలంగా విజయ్, త్రిష మధ్య వ్యక్తిగత సంబంధంపై కూడా రూమర్లు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాల మధ్య త్రిష ఈ సమయంలో తిరుమల రావడం మరింత చర్చనీయాంశంగా మారింది. అయితే మరోవైపు, ఇది పూర్తిగా వ్యక్తిగత ఆధ్యాత్మిక పర్యటన మాత్రమేనని కొందరు అభిప్రాయపడుతున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా శ్రీవారిని దర్శించుకోవడం కోసం త్రిష తిరుమలకు వచ్చిందని, ఇందులో ఇతర అర్థాలు వెతకాల్సిన అవసరం లేదని అంటున్నారు. మొత్తానికి తమిళనాడు ఎన్నికల ఫలితాల ఉత్కంఠ మధ్య త్రిష తిరుమల పర్యటన ట్రెండింగ్ టాపిక్‌గా మారింది.



## వారణాసి కోసం విదేశాల్లో మహేష్ బాబు ట్రైనింగ్..





టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం దర్శక దిగ్గజం రాజమౌళి తెరకెక్కిస్తున్న భారీ ప్రాజెక్ట్ 'వారణాసి'తో బిజీగా ఉన్నారు. గ్లోబల్ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో మహేష్ బాబు తాజాగా విదేశాలకు వెళ్లడం చర్చనీయాంశంగా మారగా, ఆయన తాజా పోస్టుతో అసలు విషయంపై క్లారిటీ వచ్చింది. ఇటీవల షూటింగ్‌కు చిన్న బ్రేక్ ఇచ్చిన మహేష్ బాబు ఎక్కడికి వెళ్లారన్నది ఆసక్తికరంగా మారింది. సినిమా తదుపరి షెడ్యూల్ కోసం ముందస్తు ఏర్పాట్లలో భాగంగా వెళ్లి ఉంటారని భావించినప్పటికీ, ఆయన స్వయంగా తన లొకేషన్‌ను సోషల్ మీడియాలో వెల్లడించారు. ప్రస్తుతం జర్మనీలోని బ్లాక్ ఫారెస్ట్ ప్రాంతంలో ఉన్నట్లు తెలిపారు.అక్కడ ట్రెక్కింగ్ చేస్తూ, ఫిట్‌నెస్ ట్రైనింగ్ తీసుకుంటూ సినిమా కోసం తనను తాను సిద్ధం చేసుకుంటున్నట్లు మహేష్ వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రముఖ ట్రైనర్ హ్యారీతో కలిసి దిగిన ఫోటోలను కూడా పంచుకున్నారు. ఇవి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. బ్లాక్ ఫారెస్ట్ జర్మనీలోని అత్యంత ప్రసిద్ధి చెందిన అటవీ ప్రాంతాలలో ఒకటి. జర్మనీ లోని బాడెన్-వుర్టెంబర్గ్ రాష్ట్రంలో ఉన్న ఈ ప్రాంతం ఫ్రాన్స్, స్విట్జర్లాండ్ సరిహద్దులకు సమీపంలో ఉంటుంది. ప్రకృతి సౌందర్యం, కొండలు, లోయలు, సరస్సులు, వన్యప్రాణులతో ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతం ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షిస్తుంది. ఇదే ప్రాంతానికి మహేష్ బాబు గతంలో కూడా వెళ్లారు.

2024లో 'గుంటూరు కారం' సినిమా విడుదల అనంతరం కూడా ఆయన ఇక్కడ ట్రెక్కింగ్ చేస్తూ కనిపించారు. ఇప్పుడు మళ్లీ అదే ప్రాంతంలో ట్రైనింగ్ తీసుకోవడం గమనార్హం. 'వారణాసి' సినిమా ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ అడ్వెంచర్ కథతో రూపొందుతున్నట్లు సమాచారం. తదుపరి షెడ్యూల్ షూటింగ్ అంటార్కిటికాలో జరుగుతుందని వార్తలు వస్తుండగా, అందుకోసమే మహేష్ ముందస్తుగా ఫిట్‌నెస్ ట్రైనింగ్ తీసుకుంటున్నారని భావిస్తున్నారు. ఇక ఈ సినిమాను అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందిస్తున్నారు. నిర్మాత ఎస్ఎస్ కార్తికేయ ఇటీవల ఇచ్చిన సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని స్పానిష్ భాషలో కూడా విడుదల చేయనున్నారు. ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో ఈ సినిమాను 2027 ఏప్రిల్ 7న విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. 'వారణాసి' కోసం మహేష్ బాబు చేస్తున్న ప్రిపరేషన్, విదేశాల్లో తీసుకుంటున్న ట్రైనింగ్ ఈ సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి.

## జూన్ 4న వస్తున్న రామ్ చరణ్ పెద్ది... ఇది పక్కా!




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, డైరెక్టర్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ రూరల్ యాక్షన్ డ్రామా విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాను ఈ ఏడాది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్టు శుక్రవారం వెల్లడించారు. ఈ మేరకు రామ్ చరణ్ తన సోషల్ మీడియా ఖాతాలో, "జూన్ 4న 'పెద్ది'ని కలవండి. థియేటర్లలో కలుసుకుందాం" అని పోస్ట్ చేశారు. ఈ మేరకు రిలీజ్ పోస్టర్ ను కూడా పంచుకున్నారు. సినిమా షూటింగ్ మొత్తం పూర్తయిన వెంటనే ఈ ప్రకటన రావడం గమనార్హం. మే 1వ తేదీ తెల్లవారుజామున, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు 'పెద్ది' షూటింగ్ పూర్తయినట్టు ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ సందర్భంగా రామ్ చరణ్‌తో తన ప్రయాణం గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. "రామ్ చరణ్‌తో 'పెద్ది' ఒక మధురమైన ప్రయాణం. ఆయనతో పనిచేయడం చాలా ప్రత్యేకం. తెరపై పవర్‌హౌస్ పెర్ఫార్మర్, తెర వెనుక అద్భుతమైన స్నేహితుడు. మేమిద్దరం కలిసి సృష్టించిన జ్ఞాపకాలకు కృతజ్ఞతలు" అని రత్నవేలు పేర్కొన్నారు. ప్రతి ఫ్రేమ్‌లో అద్భుతమైన నటనను ప్రదర్శించడమే కాకుండా, నిజ జీవితంలోనూ ఎంతో స్నేహపూర్వకంగా ఉండే వ్యక్తి అని చరణ్‌ను ఆయన కొనియాడారు.

ఈ సినిమా కోసం చివరిగా ఒక స్పెషల్ సాంగ్‌ను చిత్రీకరించినట్టు గతంలోనే వార్తలు వచ్చాయి. హైదరాబాద్‌లో రామ్ చరణ్‌పై ఈ పాటను చిత్రీకరించారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన ఈ పాటలో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే ఒక సర్‌ప్రైజ్ ఎలిమెంట్ ఉంటుందని యూనిట్ వర్గాలు తెలిపాయి. ట్యూన్, డ్యాన్స్, గ్రాండ్ సెట్, అందులోని సర్‌ప్రైజ్‌తో ప్రేక్షకులు థియేటర్లలో ఉర్రూతలూగడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఇది మరో చార్ట్‌బస్టర్ అవుతుందని అప్పట్లో పేర్కొన్నారు.

వాస్తవానికి ఈ సినిమాను ముందుగా విడుదల చేయాలని భావించినా, పోస్ట్ ప్రొడక్షన్ పనులకు మరింత సమయం కేటాయించేందుకే జూన్‌కు వాయిదా వేస్తున్నట్టు వారం క్రితం నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ ప్రకటించింది. "మా సినిమా పాటలు, గ్లింప్స్‌కు వస్తున్న స్పందన అద్భుతంగా ఉంది. సినిమా టాకీ పార్ట్ పూర్తయింది, కేవలం ఒక పాట మాత్రమే మిగిలి ఉంది. ఎడిట్ చూసుకున్నాం, అవుట్‌పుట్‌తో చాలా సంతోషంగా ఉన్నాం. ఇంత మంచి కంటెంట్‌ను అత్యుత్తమంగా అందించాలనుకుంటున్నాం. అందుకే మా టెక్నీషియన్లకు, పోస్ట్ ప్రొడక్షన్ బృందానికి కాస్త ఎక్కువ సమయం ఇచ్చి, పూర్తి నాణ్యతతో మీ ముందుకు రావాలని నిర్ణయించుకున్నాం" అని ఆ ప్రకటనలో వివరించింది. అందుకే సినిమాను జూన్‌కు వాయిదా వేస్తున్నామని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపింది. ఇప్పుడు ఆ తేదీని ఖరారు చేశారు. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న 'పెద్ది'పై మొదటి నుంచి భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. సీనియర్ నటులు శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సాంకేతికంగానూ ఈ సినిమా ఉన్నత ప్రమాణాలతో తెరకెక్కుతోంది. ఆర్ రత్నవేలు సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్, అవినాష్ కొల్లా ఆర్ట్ డైరెక్షన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



# మద్యం ధరలకు రెక్కలు



హైదరాబాద్, మే 4, : తెలంగాణలో మద్యం ధరలు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు మద్యం ధరలు చివరిసారిగా 2023 మే నెలలో పెంచారు. ఆ తరువాత ఏడాదికిపైగా మద్యం ధరలు స్థిరంగా ఉండటంతో ప్రస్తుతం మరోసారి పెంపునకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మద్యం ధరల పెంపుపై ప్రభుత్వం నియమించిన కమిటీ డిస్టిలరీల ప్రతిపాదనలను పరిశీలిస్తోంది. ఈ కమిటీలో ఆర్థిక, ఆమోదం, పరిశ్రమ శాఖల అధికారులు ఉన్నారు. ధరల పెంపునకు కారణాలు నివేదించనున్నారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులు, పన్నులు, రవాణా ఖర్చులు అధికమవడంతో ధరలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఏ బ్రాండ్ పై ఎంత ధర ఉండనుంది అంటేమద్యం ధరలు గత రెండేళ్లుగా స్థిరంగా కొనసాగాయి. దీంతో డిస్టిలరీలు నష్టాలు చవిచూస్తున్నాయని తెలుపుతున్నారు. దీంతో వారి ప్రతిపాదనను రాష్ట్రప్రభుత్వం నియమించిన కమిటీకి నివేదించారు. దీనిపై కమిటీ పరిశీలిస్తోంది. ఇందులో భాగంగా సాధారణ బ్రాండ్ ఫుల్ బాటిల్‌పై రూ.60, ప్రీమియం బ్రాండ్‌లపై రూ.100, హయ్యర్ కేటగిరీ బ్రాండ్‌లపై రూ.120 పెంపు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే డిస్టిలరీల నుంచి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగానే పెంపు ఉంటుందని సమాచారం. రెండేళ్లకోసారి జరిగే ధరల సవరణ ఈసారి ఆలస్యం అయ్యింది. కాబట్టి రెండు రోజుల్లోనే అధికారిక ప్రకటన వచ్చే సూచనలు ఉన్నాయి. ఈ ధరల పెంపు ప్రజల జీవితంపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. మద్యంపై ఆసక్తి ఉన్నవారికి ఖర్చు ఎక్కువవుతుంది. అయితే ప్రభుత్వం దీని ద్వారా ఆదాయం పెంచుకోవాలని భావిస్తోంది. గతంలో కూడా ఇలాంటి పెంపులు జరిగాయి. ఈసారి పెంపు మేర తక్కువగా ఉంటే కూడా ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది. అధికారిక ప్రకటన తర్వాత బార్లు, వైన్సులల్లో కొత్త ధరలు అమలవుతాయి. డిస్ట్రిక్ట్‌ల వారీగా మార్కెటింగ్ విభాగం పరిశీలిస్తుంది. ప్రస్తుతం ఈ విషయంపై రాజకీయ చర్చలు జరుగుతున్నాయి. ప్రతిపక్షాలు దీన్ని విమర్శిస్తున్నాయి. మద్యం ధరల పెంపు రాష్ట్ర ఆర్థికాలకు ఎలా దోహదపడుతుందో చూడాలి. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో గణనీయంగా పెరిగాయి. ప్రభుత్వం బీర్ల గరిష్ఠ చిల్లర ధర (ఓఖీఖ)పై సుమారు 15 శాతం పెంపు జారీ చేసింది. దీంతో లైట్ బీర్ దాదాపు రూ.150 నుంచి సుమారు రూ. 180కి పెరిగింది. స్ట్రాంగ్ బీర్ రూ.160 నుంచి దాదాపు రూ.190కి పెరిగింది. మరికొన్ని ప్రీమియం బ్రాండ్లలో ఒక్కో బీర్‌పై సగటున రూ.30 నుంచి 40 వరకు పెంచారు. అయితే మద్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో బీర్ల ధరలు పెరుగుతాయా..? చూడాలి.

# సంకష్టహర చతుర్థికి సిద్ధివినాయక ఆలయం ముస్తాబు..



## దర్శనానికి ప్రత్యేక బస్సులు



జహీరాబాద్, మే 4 : ఏడాది పొడువునా ప్రతి నెలా వచ్చే సంకష్టహర చతుర్థి రోజు వర సిద్ధి వినాయకుడిని దర్శించుకుంటే ఎంతో పుణ్యం వస్తుందనేది భక్తుల ప్రగాఢ నమ్మకం. మంగళవారం వచ్చే అంగారక సంకష్టహర చతుర్థి రోజున దర్శించుకుంటే అత్యంత పుణ్యఫలం వస్తుంది. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్‌లో స్వయంభుగా వెలిసిన సిద్ధి వినాయక ఆలయం మంగళవారం నిర్వహించనున్న అంగారక సంకష్ట హర చతుర్థి వేడుకలకు ముస్తాబైంది. ఈ రోజున స్వామివారిని దర్శించుకునేందుకు కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు పాదయాత్రగా భారీగా తరలివస్తారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసింది. ఆలయంలోఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్ ఆధ్వర్యంలో రూరల్ సీఐ జక్కుల హనుమంతు హద్నూర్ ఎస్సై దోమ సుజిత్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను నిలిపేందుకు ప్రత్యేకంగా పార్కింగ్, తాగునీరు, వసతి, అన్నదానం తదితర సదుపాయాలు కల్పించారు. అంగారక సంకష్టహర చతుర్థిని పురస్కరించుకుని మంగళవారం అర్ధరాత్రి 1 గంట నుంచి ఉదయం 6 గంటల వరకు స్వామికి అభిషేకం, గణపతి హవనం, స్వామివారి కల్యాణం, హారతి తదితర ప్రత్యేక పూజలు చేపట్టనున్నామని ఆలయ వేద పండితులు తెలిపారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం జహీరాబాద్, బీదర్ ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. మంగళవారం తెల్లవారు జామున సంగారెడ్డి కలెక్టర్ డాక్టర్ శరత్, అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, రాజర్షిషా ఆలయాన్ని సందర్శించి, స్వామివారికి అభిషేకం, హారతి తదితర పూజలు చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై సిద్ధివినాయక స్వామి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు రేజింతల్ అశోక్, ప్రధాన కార్యదర్శి అలాడి నర్సింలు కోరారు.

# ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ బ్యూరో (తెలంగాణ వాణి) ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే స్పందించాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఆర్డీఓ కార్యాలయం నిర్మల్, సబ్ కలెక్టర్ కార్యాలయం భైంసాలో డివిజన్ వారీగా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మారుమూల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే గణనలో భాగంగా నిర్వహిస్తున్న సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. అధికారులు తప్పనిసరిగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన..ప్రగతి ప్రణాళిక

కుత్బుల్లాపూర్ (తెలంగాణ వాణి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం సందర్భంగా, కొంపల్లి లోని కె.వి.ఆర్ ఫంక్షన్ హాల్‌లో సీఈఓ కాంతమ్మ అధ్యక్షతన నిర్వహించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ముఖ్యఅతిథులుగా పాల్గొని జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించిన ,కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు నేరుగా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని అన్నారు. పేదలు, రైతులు, మహిళలు, యువత, మైనారిటీ వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రత్యేకంగా మైనారిటీ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని, మైనారిటీ యువతకు ఉచిత స్కూటీలు, మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు అందించడం ద్వారా వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ స్వావలంబన దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోందని స్పష్టం చేశారు. ఈ పథకాలు మైనారిటీ కుటుంబాల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి ఇప్పటివరకు మైనారిటీ మహిళలకు సుమారు 400 ఉచిత కుట్టుమిషన్లు పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

ఈ కుట్టుమిషన్లు మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, వారి కుటుంబాల ఆర్థిక స్థిరత్వాన్ని మెరుగుపరచడంలో కీలకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించడమే ప్రజా పాలన యొక్క ముఖ్య ఉద్దేశమని, ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు అందేలా కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేయాలన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్, మే:(తెలంగాణ వాణి ప్రతినిధి): వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సారంగాపూర్ మండలం ఆలూరు గ్రామంలో గలవరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. వరి ధాన్యం కొనుగోలు తీరును ఆయన పరిశీలించారు. కొనుగోలుకు సంబంధించి అన్ని రకాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతూ, ధాన్యం అమ్మేందుకు వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, రైతులకు త్రాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. తగినన్ని గన్ని సంచులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. నిర్ణీత తేమశాతానికి రాగానే ధాన్యం తూకం వేసి, వెంటనే వరి ధాన్యాన్ని తరలించాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆటోమేటిక్ ప్యాడి క్లీనింగ్ యంత్రం పనితీరును పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ, ప్రతి రైతు తమ ధాన్యాన్ని శుభ్రపరచి మాత్రమే తూకానికి ఇవ్వాలన్నారు. ఇలా చేస్తే రైతులు నష్టపోకుండా ఉంటారని వివరించారు. వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిఎం సివిల్ సప్లయిస్ సుధాకర్, తహసిల్దార్ విజయ కాంతారావు, ఎంపీడీవో లక్ష్మీ కాంతరావు, సర్పంచ్ ఈర్ల చిన్నయ్య, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రసాయన శాస్త్రంలో రమేష్ గౌర కు పీహెచ్.డీ.



పటాన్ చెరు, మే 4, (తెలంగాణ వాణి రిపోర్టర్): హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి రమేష్ గౌర డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'మెథిమజోల్, లెవోడోపా, మిటాపివాట్ సల్ఫేట్, వారెనిక్లిన్ టార్ట్రేట్ అనే క్రియాశీల ఔషధ పదార్థాల వినూత్న సంశ్లేషణ పద్ధతుల అభివృద్ధి'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎం.ఎస్.సురేంద్ర బాబు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ రమేష్ చేసిన డాక్టరల్ పరిశోధన, కీలకమైన ఫార్మాస్యూటికల్ సమ్మేళనాల కోసం సమర్థవంతమైన, సురక్షితమైన, ఆర్థికంగా లాభదాయకమైన సంశ్లేషణ మార్గాలను రూపొందించడం పై దృష్టి సారించినట్టు తెలిపారు.

డాక్టర్ రమేష్ నాలుగు ముఖ్యమైన క్రియాశీల ఔషధ పదార్థాల (ఏపీఐల) కోసం నూతన, విస్తరించదగిన ప్రక్రియలను అభివృద్ధి చేసి, తద్వారా దిగుబడి, మలినాల నియంత్రణ, ప్రక్రియ భద్రత, పారిశ్రామిక సాధ్యతను గణనీయంగా మెరుగుపరిచినట్టు వివరించారు. ముఖ్యంగా, ఆయన చేసిన కృషిలో మెథమజోల్ కోసం క్వాలిటీ బై డిజైన్ (క్యూబీడీ) ఆధారిత పటిష్ఠమైన ప్రక్రియ, లెనోడోపా కోసం సరళీకృత రెండు దశల సంశ్లేషణ, మిటాపివాట్ సల్ఫేట్ కోసం ఆప్టిమైజ్ చేసిన బహుళ దశల మార్గం, అధిక స్వచ్ఛత, నియంత్రణ సమ్మతిని నిర్ధారించే వేరెనిక్లిన్ టార్ట్రేట్ కోసం నైట్రోసమైన్ రహిత మార్గం ఉన్నాయని రుజువు చేశాడన్నారు.

అధునాతన విశ్లేషణాత్మక లక్షణాల మద్దతుతో ఆయన చేసిన పరిశోధన, ఔషధ తయారీకి ఆచరణాత్మక, పరిశ్రమకు సంబంధించిన పరిష్కారాలను అందిస్తూ, ప్రాసెస్ కెమిస్ట్రీ రంగంలో విలువైన పురోగతికి దోహదపడుతుందని తెలిపారు.

## మూఢనమ్మకాలను నమ్మకండి..

# భూత వైద్యుల చేత మోసపోకండి

## డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు)



జమ్మికుంట:మే 04 (తెలంగాణ వాణి): జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి నుండి శ్రీరాముల పల్లి,మడిపల్లి కి వెళ్లే మూడు దారులలో ఆదివారం అర్ధరాత్రి భూత వైద్యులచే స్టార్ ఆకారంలో ముగ్గు పోసి పసుపు కుంకుమ,నిమ్మకాయలు,న్యూస్ పేపర్ తో మనిషి ఆకారంలో తయారు చేసిన బొమ్మ. ఒక రూపాయి బిళ్ళ, ముగ్గు పోసి పూజలు నిర్వహించినట్లు ఆనవాళ్లు కనిపించడంతో ఆ ప్రాంతంలో నుండి వెళ్లే ప్రజలు భయ భ్రాంతులకు గురై ఘటన స్థలం చూసి భయంతో ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉందని స్థానికుల సమాచారం అందుకున్న డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు) ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభు మాట్లా డుతూ ప్రజలు అశాస్త్రీయమైన పద్ధతులను అవలంబిస్తూ ఆర్థిక ఇబ్బందులు,కుటుంబ సమస్యలు,అనారోగ్య సమ స్యలకు గురైన పేద,మధ్యత రగతి వారు భూత వైద్యు లను ఆశ్రయించి వారికి వేలాది రూపాయల డబ్బులు చెల్లించి ఇలాంటి చేతబడులు కూడళ్ల వద్ద దింపి పోయ డాలు చేయడం అజ్ఞానమని అన్నారు. ఆర్థిక పరిస్థితులు బాగు లేకుంటే కష్టించి పని చేస్తే డబ్బులు వస్తాయని, అనారోగ్యానికి గురైతే శాస్త్రీ య పద్ధతులలో హాస్పిటల్స్ కెళ్ళి డాక్టర్లకు చూపించుకొని మెరుగైన వైద్యం చేయించు కోవాలని సూచించారు. ఇలాంటి అశాస్త్రీయమైన మూఢనమ్మకాలకు ప్రజలు భయపడకూడదని నిర్భ యంగా బ్రతికే విధంగా జీవన విధానాన్ని అలవర్చుకోవాలని అన్నారు. అనంతరం పేపర్ తో తయారు చేసిన బొమ్మను కాల్చి,కట్ చేసిన నిమ్మకాయలను అక్కడినుండి తీసివేసి,ముగ్గు,పసుపు కుంకుమ చల్లిన ఆనవాళ్లను నీటితో శుభ్రం చేశారు.

# విద్యార్థులను అభినందించిన కలెక్టర్



నిజామాబాద్, మే 04 : (తెలంగాణ వాణి ప్రతినిధి) : ఇటీవల వెలువడిన పదవ తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన సిరికొండ జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల విద్యార్థులను కలెక్టర్ ఇలా త్రిపాఠి అభినందించారు. 582 మార్కులు సాధించిన సుదీప్తినితో పాటు 550 పైన మార్కులు సాధించిన విద్యార్థులు సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందిస్తూ, భవిష్యత్తులో మీరు ఏమి కావాలని కోరుకుంటున్నారని వారి లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇదే స్ఫూర్తితో ఉన్నత విద్యను అభ్యసించాలని వారికి హితవు పలికారు. జిల్లాలో 107 ప్రభుత్వ పాఠశాలల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత నమోదు అయ్యిందని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలు చాలా బాగా నడుస్తున్నాయని, ఉపాధ్యాయులు అంకిత భావంతో బోధన విధులు నిర్వహిస్తున్నారని, పదవ తరగతి ఫలితాలే ఇందుకు నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాలు ఎంతగానో మెరుగుపర్చిందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కలెక్టర్ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియుటిఎస్ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, జెడ్పిహెచ్ఎస్ సిరికొండ గెజిటెడ్ హెచ్.ఎం సతీష్ కుమార్ పాల్గొన్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com